
V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
30-05-2024
సంపుటి : 01 | సంచిక : 28 | పేజీలు : 08 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


Ln. డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB

# బెల్ట్ జోరు..
## మందుబాబుల బేజారు..



- అధిక ధరలకు మద్యం అమ్మకాలు
- సిండికేట్ దందానే అసలు కారణం..
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ
- ప్రజాప్రతినిధులదీ ప్రధాన హస్తం..
- ప్రతిఒక్కరికీ నెలవారీ మామూళ్లు




**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:**

అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల పరిహాసం.. ఫలితంగా మందుబాబుల జేబులు గుల్లవుతున్నాయి. మద్యం అమ్మకాల్లో నిబంధనలకు నీళ్లొదిలి.. సిండికేట్ దందాకు అక్రమార్కులు తెరలేపారు. అడ్డుకోవాల్సిన అధికారులు.. అందినకాడికి దండుకుని సైలెంట్ అయిపోతున్నారు. దీంతో మద్యం అమ్మకాల్లో సిండికేట్ వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిపోయింది. మిగతా2లో...



# బీఆర్ఎస్ v/s కాంగ్రెస్



## రాష్ట్ర చిహ్నం మార్పుపై రగడ..

- రాజముద్ర తెలంగాణ చరిత్రకి, సంస్కృతికి ప్రతీక
- కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరికపు గుర్తులు కాదు
- తెలంగాణలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిగా మారింది
- అందుకే రాష్ట్ర చిహ్నం, గీతాన్ని మార్చుతున్నారన్న కేటీఆర్
- బీఆర్ఎస్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన కాంగ్రెస్
- రాజముద్రలో అమరుల త్యాగాల ఆనవాళ్లే లేవు
- జాతీయ సమగ్రత ప్రజ్వరిల్లేలా.. తెలంగాణ ప్రాభవం ఉట్టిపడేలా..
- ఉద్యమ ఉనికి కళ్లకు కట్టేలా.. రాజముద్ర ఉంటుంది

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేళ రాష్ట్ర గీతం, రాష్ట్ర చిహ్నాల రగడ మొదలైంది. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' కీరవాణి చేత కంపోజ్ చేయిస్తుండటంపై ఇప్పటికే వివాదం రాజుకుంది. ఇప్పుడు ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంలోనూ మార్పులు చేయడానికి పూనుకోవడంతో దుమారం మొదలైంది. ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఏమీ పట్టనట్టు చకచకా మార్పులు చేర్పులు చేసుకుంటూ అవతరణ వేడుకలపై ఏర్పాట్లను ముమ్మరం చేసుకుంటోంది.

**రాష్ట్ర చిహ్నంలో మార్పులపై విమర్శలు...**

రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేస్తున్నట్లు స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించడం, మిగతా2లో...

## కేసీఆర్‌ది దేశద్రోహమే..

- ఫోన్ ట్యాపింగ్ పాల్పడటం నేరం
- వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ఎవరిచ్చారు?
- రేవంత్ బాధితుడే అయినప్పటికీ రాజీపడ్డారు
- బీఆర్ఎస్ ఇండియా కూటమిలో చేరడం ఖాయం
- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


2

## ఎక్కడా విత్తనాలు, ఎరువుల కొరత లేదు

- విపక్షాలు రైతులతో చెలగాటం ఆడవద్దు
- రాష్ట్రంలో ఎక్కడా తొక్కిసలాట జరగలేదు
- అపోహలతో రైతులు ఆందోళన చెందవద్దు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


2

## ప్రశ్నించే హక్కు బీజేపీకి లేదు

- సోనియాను ప్రశ్నించే అర్హత లేదు
- ఉద్యమకారులను గౌరవించింది సోనియానే..
- బీజేపీ ఆ బాధ్యతలను విస్మరించింది
- కిషన్ రెడ్డి కామెంట్స్‌పై విజయశాంతి ఫైర్


2

## జూన్ 3న ఏం జరగనుంది?

- మద్యం కేసులో కవిత పాత్రపై ఈడీ ఛార్జిషీట్
- పరిగణనలోకి తీసుకున్న రౌస్ అవెన్యూ కోర్టు
- జూన్ 3న హాజరు కావాలని కవిత, మరో నలుగురికి సమన్లు
- గోవాలో ప్రచారం చేసిన నలుగురి పేర్ల ప్రస్తావన
- మద్యం పాలసీ కేసులో వచ్చిన డబ్బు గోవాకు
- ఆ డబ్బు గోవాకు ఎలా చేరింది అంటూ ఈడీ ఛార్జిషీట్

2


## రూ.3 కోట్లతో జంప్

- ఎస్బీఐ ఏటీఎం డిపాజిట్ సంస్థ ఉద్యోగి నిర్వాకం
- ఏటీఎంలో డబ్బులు పెట్టడానికి వెళ్లి పరారీ
- సిబ్బంది లోపల ఉండగా బ్యాగ్‌తో ఎస్కేప్
- స్కైర్ వాల్యూ సంస్థ ఉద్యోగిగా గుర్తింపు


2

## 1200 మంది ఫోన్లు ట్యాప్ చేశాం

- 56 మంది ఎస్ఓటీ పోలీసులతో ట్రాప్
- కేసీఆర్‌కు యాంటీగా ఉన్న వాళ్లందరిపై ఫోకస్
- 8 ఫోన్లతో ట్రేసింగ్ చేసి డబ్బులు సీజ్
- ప్రభాకర్ రావు ఛాంబర్ పక్కన్నే రెండు లాగర్ రూమ్‌లు ఏర్పాటు
- ట్యాపింగ్ కోసం సన్నిహితులకు స్పెషల్ పోస్టింగ్
- ప్రభుత్వం మారగానే డేటా మొత్తం ధ్వంసం
- హార్డ్ డిస్కులు, పెన్ డ్రైవ్‌లు మూసీలో పడవేత



**విశ్వంభర, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్వే కొద్దీ కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. తాజాగా బహిర్గతమైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు వాగ్మూలంలో పలు కీలక విషయాలు పోలీసులకు వివరించాడు. ఎస్ఐబీకి 2019లో బదిలీ అయ్యానని తెలిపారు. అక్కడ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక మిగతా2లో...



## నటి హేమకు మళ్లీ నోటీసులు

- జూన్ 1న విచారణకు హాజరుకావాలని ఆదేశం
- మే 27న విచారణకు డుమ్మా కొట్టిన హేమ
- ఈసారి హాజరు అనుమానమే?

8

# ప్రభుత్వం ఉన్నట్టా.. లేనట్టా?

## తెలంగాణ రైతులకు ఏమిటీ వెతలు

- ధాన్యం కొనేటోడు లేడు.. విత్తనాలు అమ్మేటోడు లేడు
- రంగారెడ్డి నుంచి కామారెడ్డి దాకా ఇవే కష్టాలు
- 6 నెలల్లోనే పాలన ఆగం అయిందనడానికి ఇదే నిదర్శనం
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తెలంగాణ ప్రభుత్వంపై ట్విట్టర్ వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. తెలంగాణలో రైతు కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని ప్రశ్నించారు. విత్తనాల కోసం రైతులకు ఈ వెతలు ఏమిటని నిలదీశారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ మంత్రి ఎక్కడున్నారు? ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేదని ట్వీట్ చేశారు. మిగతా2లో...

## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 135 | ₹ 162 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹235 | ₹267 |

## నిన్ను చంపేస్తాం..

### ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

- బెదిరింపు కాల్స్ వచ్చిన నెంబర్లు రిలీజ్
- సీఎం రేవంత్ రెడ్డి నంబర్ ఇచ్చానన్న రాజాసింగ్
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవట్లేదు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు, డీజీపీకి ఫిర్యాదు చేశా..

2


## భార్యతో గొడవ పడి.. మద్యానికి బానిసై..

- ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కాల్
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- మద్యం మత్తు, డిప్రెషన్‌తోనే ఫోన్
- గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

2

# ప్రభుత్వం ఉన్నట్టా.. లేనట్టా..?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారంలో తిరగడం తప్ప.. ఎన్ని ఎకరాలకు విత్తనాలు అవసరమో లెక్కలేదా అని కేటీఆర్ ప్రశ్నల వర్ష కురిపించారు

**ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలి**

నిన్న.. ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! నేడు.. విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడని సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి.. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని అన్నారు. సాగునీళ్లు ఇవ్వడం చేతకాక పంటలు ఎండగొట్టారు.. ఇప్పుడు విత్తనాలు అందించే విజన్ కూడా లేదా అని ప్రశ్నించారు. తెల్లవారు జామున 4 గంటలకు లైన్ లో నిలబడితే.. సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వకపోతే ఎలా అని ట్వీట్ చేశారు. గత పదేళ్లపాటు.. 10 నిమిషాల్లో అందిన విత్తనాలు.. 10 గంటలపాటు పడిగాపులు పడినా అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి నుంచి.. కామారెడ్డి దాకా.. రైతులకు ఏమిటీ కష్టాలు.. ఇంకెన్నిరోజులు ఈ కన్నీళ్లని నిలదీశారు. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణలో అన్నదాతకే తిండి తిప్పలు లేకుండా చేస్తారా అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**6 నెలల్లోనే ఆగం ఆగం**

బీఆర్ఎస్ పాలనలో పండుగలా సాగిన వ్యవసాయాన్ని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఆగం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా.. సరిపడా విత్తనాల స్టాక్ తెప్పించండి...బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా కళ్లెం వేయండని సూచించారు. లేకపోతే.. రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. గ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

# ప్రశ్నించే హక్కు బీజేపీకి లేదు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో అన్ని పార్టీల ఫోకస్ ఇప్పుడు రాష్ట్ర అవతరణ దినోత్సవం పైనే ఉంది. తెలంగాణ ప్రభుత్వం సోనియా గాంధీని ఈ వేడుకులకు చీఫ్ గెస్ట్ గా ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి వెళ్లి స్వయంగా పిలిచారు. అయితే, ఆమె హాజరవుతారా? లేదా అనే దానిపై ఉత్కంఠ నడుస్తోంది. కానీ.. ఆమె రావాడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోంది. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సోనియా ఎలా హాజరవుతారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. దీనిపై సినీనటి, కాంగ్రెస్ సీనియర్ నేత విజయశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాను ఆహ్వానించడాన్ని ప్రశ్నించే అర్హత బీజేపీ లేదని ఆమె స్పష్టం చేశారు. ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని ప్రకటించి బీజేపీ మాట తప్పిందని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ బాధ్యత తీసుకోకుండా పక్కన పెడితే.. ఆ బాధ్యత కాంగ్రెస్ తీసుకుందని గుర్తు చేశారు. రాజకీయంగా నష్టం జరిగినా.. తెలంగాణ ఏర్పాటుకు సోనియాగాంధీ ముందుకు వచ్చారని అన్నారు. ప్రాణ త్యాగాలను, తెలంగాణ ఉద్యమకారులను గౌరవించిన ఘనత సోనియాకే దక్కుతుందని రాములమ్మ ట్వీట్ చేశారు. ప్రత్యామ్నాయం లేక పార్లమెంటులో తెలంగాణ బిల్లుకు బీజేపీ ఓటు వేసిందని విమర్శించారు. నిజానికి తెలంగాణ ఏర్పాటులో బీజేపీ ప్రమేయం ఎక్కడుందని ఆమె ప్రశ్నించారు. ఇది తన ప్రశ్న కాదని.. తెలంగాణ సమాజం, ఉద్యమకారుల ప్రశ్న అని ఆమె అన్నారు. కాబట్టి కాంగ్రెస్ ను, సోనియా గాంధీని విమర్శించడం మానుకోవాలని బీజేపీ నేతలకు రాములమ్మ సూచించారు.

# జూన్ 3న ఏం జరగనుంది?

**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో తదుపరి విచారణ జూన్ 3కి వాయిదా పడింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సహా ఇతర నిందితులపై ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటును రౌస్ అవెన్యూ కోర్టు పరిగణలోకి తీసుకుంది. కవిత, చన్ ప్రీత్ తో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న అందరికీ రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ దాఖలు చేసిన 6వ అనుబంధ ఛార్జ్ షీటును ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మే 10న దాఖలు చేసింది. దీన్ని కోర్టు పరిగణలోకి తీసుకుంది. జడ్జి కావేరీ బవేజా విచారణ జరిపారు. అనుబంధ ఛార్జ్ షీటులో నిందితులుగా పేర్కొన్న ఐదుగురికి (కవిత, చన్ ప్రీత్, మరికొందరు) కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే కవిత, చన్ ప్రీత్ ను అరెస్ట్ చేశారు కనుక.. అరెస్ట్ కాని మిగతా ముగ్గురికి (దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్) నోటీసులు జారీ చేసి కోర్టులో హాజరుకావాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చారు. దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, చన్ ప్రీత్, అరవింద్ సింగ్.. వీరంతా హవాలా రూపంలో గోవాకు డబ్బు తరలించడంలో సహాయకారులుగా ఉన్నారు, లిక్కర్ పాలసీని తమకు అనుకూలంగా రూపొందించినందుకుగాను సౌత్ గ్రూప్ 100 కోట్ల రూపాయల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీకి విజయ్ నాథ్ ద్వారా అందించారని, అందులో 45 కోట్ల మొత్తాన్ని హవాలా రూపంలో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చు చేయడానికి తరలించారని చెప్పారు. కవిత 100 కోట్ల ముడుపులు సమకూరిస్తే, ఆ 100 కోట్లలో కొంత మొత్తాన్ని గోవాకు తరలించడంలో చన్ ప్రీత్, దామోదర్ శర్మ, అరవింద్ సింగ్, ప్రిన్స్ కుమార్.. ఆమ్ ఆద్మీ పార్టీ కోసం ఖర్చు చేయడంలో పాత్రధారులుగా ఉన్నారని, వారందరికీ కోర్టు నోటీసులు జారీ చేయడం జరిగింది. కవితను మార్చి 16న అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైల్లో కవిత ఉన్నారు. ఆమెపై కోర్టులో ఇప్పటివరకు దాఖలు చేసిన ఛార్జ్ షీటులో కవితను కింగ్ పిన్ గా దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. కవిత కీలక సూత్రధారిగా, పాత్రధారిగా ఉన్నారని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

# భార్యతో గొడవ పడి.. మద్యానికి బానిసై..

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రజాభవన్, నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు ఫోన్ చేసిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. చిక్కడపల్లికి చెందిన శివకుమార్ అలియాస్ అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డయల్ 100కి వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుడిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ నిందితుడిని నాంపల్లి పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు. మంగళవారం ఉదయం పంజాగుట్ట ప్రజాభవన్‌లో, నాంపల్లి కోర్టులో బాంబు పెట్టామని కాసేపట్లో పేలుతుందని ఫోన్ చేసి నిందితుడు శివకుమార్ టెన్షన్ క్రియేట్ చేశాడు. భార్యతో గొడవ పడి మద్యానికి బానిసై డిప్రెషన్‌లో ఇలా చేశానని పోలీసులకు తెలిపాడు. గతంలో శివకుమార్ ద్విచక్ర వాహనాలు దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శివకుమార్ ముషీరాబాద్‌లో ఉంటున్నాడు. అతనిని గుంటూరు జిల్లా వాసిగా గుర్తించారు.

# ఎక్కడా విత్తనాలు, ఎరువుల కొరత లేదు

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో విత్తనాల కోసం ఎక్కడా తొక్కిసలాట జరగలేదని, రైతులపై లాఠీ ఝళింపలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విత్తనాలు, రసాయన ఎరువుల కొరత అంటూ అమెరికా, యూకే, ఆస్ట్రేలియా నుంచి కొందరు ఎక్స్ వేదికగా సామాజిక మాధ్యమాలకు పంపుతున్నారని తప్పుబట్టారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ప్రధాన వాణిజ్య పంట పత్తి, పచ్చిరొట్ట, ఇతర పంటల విత్తనాలు లేవంటూ ఎవరో సృష్టించిన అపోహలకు రైతులు లోనుకావద్దని మంత్రి చెప్పారు. విపక్షాలు రైతులతో చెలగాటం ఆడవద్దని హితవు పలికారు. గత ఐదు మాసాలుగా విద్యుత్, సాగు నీరుపై రాజకీయం చేశారు, ఎలాంటి ఫలితాలు రాలేదని ఆక్షేపించారు. ఇంత రాద్ధాంతం చేసి ఆదుర్దా సృష్టిస్తే విపక్షాలకు ఏమైనా క్షణికానందం కలిగిందేమో? అని విమర్శించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం నియమావళి అమల్లో ఉన్నప్పటికీ ఎప్పికప్పుడు లేఖలు రాసి అనుమతులు తీసుకుని ఖరీఫ్ సీజన్ కోసం విత్తన నిల్వలు, రసాయన ఎరువులు, ఇతర ఉపకరణాలు అందుబాటులోకి చేర్చడం ద్వారా ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విపక్షాలు ఈ రకంగా బదనాం చేయాలనుకుంటే రైతులను ఆందోళనకు గురిచేయడమేనంటూ ఆరోపించారు. ఏ విధమైన అపోహలకు తావు లేదు. రాజకీయ లబ్ధి పొందాలని రైతులను తప్పుదోవ పట్టిస్తే నమ్మవద్దని మంత్రి తుమ్మల సూచించారు.

# బెల్ట్ జోరు..



(మొదటి పేజీ తరువాయి)

ఈజీ మనీ కోసం గ్రామీణ ప్రాంతాల్లోనూ బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా తయారయ్యాయి. వీటిపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో సిండికేట్ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. నిత్యం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రూ.కోట్లలో దందా జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. ప్రధానంగా సరిహద్దు ప్రాంతాల్లో వ్యాపారులకు మద్యం అమ్మకాలు కాసులు కురిపిస్తోంది.

**ఇచ్చిన బ్రాండ్ తాగాల్సిందే..**

మద్యం దుకాణాల్లో నచ్చిన బ్రాండ్ కొనుగోలు చేసి తాగే పరిస్థితి మద్యం ప్రియులకు లేకుండా పోయింది. నిజానికి మద్యం దుకాణాల్లో ప్రతి బ్రాండ్ మద్యం దొరకాల్సి ఉంటుంది. కానీ పలు బ్రాండెడ్ కంపెనీలు మార్జిన్(కమీషన్) తక్కువగా ఇస్తుంటాయి. కొన్ని బ్రాండ్లపై మాత్రమే మార్జిన్ అధికంగా ఉంటుంది. దీంతో మద్యం దుకాణాల యాజమాన్యాలు మార్జిన్ అధికంగా ఇచ్చే కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను మాత్రమే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. మద్యం దుకాణాల్లో దొరకని మంచి బ్రాండ్ల మద్యం.. బెల్ట్ దుకాణాల్లో మాత్రం దర్శనమిస్తుంది. కాకపోతే ఇక్కడ ఒక్కో బాటిల్‌కు అదనంగా డబ్బు సమర్పించుకోవాల్సిందే. మద్యం దుకాణాల్లో దొరకని మద్యం.. బెల్ట్ దుకాణాల్లో దొరకడం వెనుక సిండికేట్ దందా చక్రం తిప్పుతుండడం గమనార్హం. మద్యం దుకాణాల్లో మంచి బ్రాండ్ల మద్యం ఉన్నా.. స్టాక్ లేదంటూ మందుబాబులకు ఇవ్వకుండా మాములు బ్రాండ్ల మద్యాన్ని అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు.

**సరిహద్దు ప్రాంతాల్లో జోరు..**

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా మద్యం అమ్మకాల్లో సిండికేట్ దందాదే కీలక పాత్ర. ప్రధానంగా జిల్లా సరిహద్దుగా ఉన్న ప్రాంతాల్లో సిండికేట్, బెల్ట్ దుకాణాల వ్యవహారం జోరు మీద ఉంది. కోదాడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని కొన్ని మద్యం దుకాణాల వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తోంది. పొరుగు రాష్ట్రమైన ఏపీలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు ఉండడం.. వీరికి బాగా కలిసొస్తుంది. మందుబాబులు అక్కడ అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయలేక.. తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి మద్యం సేవిస్తుంటారు. ఇదే సమయంలో మద్యం అక్రమ రవాణకు తెరలేపారు. ఇందుకు బెల్ట్ దుకాణాలే ప్రధాన కేంద్రంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్ దుకాణాల్లో విక్రయించేందుకంటూ మద్యం బాటిళ్లను భారీగా తీసుకెళ్లి.. ఏపీకి అక్రమంగా తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో ఏకంగా ఎక్సైజ్, పోలీసు, అధికార పార్టీ నేతల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

**ప్రతి నెలా భారీగా మాముళ్లు..**

మద్యం దుకాణాల వ్యాపారులు సిండికేట్ దందాకు తెరలేపడంతో అనధికారికంగా ప్రతినెలా రూ.కోట్లు చేతులు మారుతున్నాయి. ఈ అక్రమ దందాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం భాగస్వామ్యులవ్వడం కొసమెరుపు. సిండికేట్ దందాకు సహకరిస్తూ.. ప్రతి నెలా 'తిలా పాపం.. తలా పిడికెడు' అన్న చందంగా రూ.లక్షల ముడుపులు తీసుకుని మౌనం వహిస్తున్నారు. నిజానికి మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియలో అలాట్ అయ్యిన లబ్ధిదారుల నుంచి సిండికేట్ వ్యాపారులు అధిక ధరకు కొనుగోలు చేసి.. ఈ తరహా దందాకు తెరలేపుతున్నారు. మద్యం దుకాణాల లాటరీ ఎంపిక ప్రక్రియలో మద్యం దుకాణాలను దక్కించుకునే వ్యక్తి కొత్తవారు అయినా.. మద్యం వ్యాపారం అంతగా తెలియని వారికి దుకాణం తగిలితే.. వారికి గుడ్ విల్ కింద రూ.లక్షలు ముట్టజెప్పి దుకాణాన్ని వారి నుంచి తీసుకుంటారు. రూ.లక్షల పెట్టుబడికి రూ.కోట్ల లాభం రాబట్టుకునేందుకు సిండికేట్ దందాకు దారితీస్తుంటారు. ఈ దందా కోసం ఎక్సైజ్ అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఎవరెవరికీ ఎంత వాటా ఇవ్వాలనేది ముందుగానే నిర్ణయించారు. ఆ తరహా వ్యవహారమే ఇటీవల కోదాడలో వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మద్యం అమ్మకాల్లో సిండికేట్ దందా, బెల్ట్ దుకాణాల జోరుకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనే చెప్పాలి.

## ఒక్కో బాటిల్‌పై రూ.50 వరకు అధికం...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సిండికేట్ దందా పుణ్యమంటూ మద్యం బాటిళ్ల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. అదేంటి మద్యం బాటిళ్ల ధరను ముందుగానే నిర్ణయిస్తే.. ధరలు ఆకాశన్నంటడం ఏమిటి అనుకుంటున్నారా.. మరేం లేదండీ.. ఏ మండలానికి ఆ మండలంలోని మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి.. కొత్త దందాకు తేరలేపారు. ఆయా మండలాల పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తుండగా, బెల్ట్ దుకాణాల్లో మాత్రం ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అధిక ధర వసూలు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి.. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసే బెల్ట్ దుకాణాలకు సరఫరా చేసే మద్యానికి ప్రత్యేకంగా స్టిక్కర్ వేస్తారు. ఈ స్టిక్కర్ లేని మద్యం బాటిళ్లను బెల్ట్ దుకాణాల్లో అమ్మడం నిషిద్ధం. అలా ఎవరైనా అమ్మితే ఎక్సైజ్ అధికారులతో దాడులు చేయించి కేసులు నమోదు చేస్తుంటారు. దీంతో బెల్ట్ దుకాణదారులు సిండికేట్ నుంచే మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ కంటే రూ.10 నుంచి రూ.20 అదనంగా ఇచ్చి తీసుకెళ్తుంటారు. ఈ డబ్బును బెల్ట్ దుకాణాల్లో మద్యం సేవించేందుకు వచ్చిన మందుబాబుల నుంచి ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తుంటారు.

# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై సమీక్ష చేస్తోన్న కొన్ని ఫొటోలు బయటకి రావడంతో ఒక్కసారిగా విమర్శలు వెల్లువెత్తాయి. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా రాష్ట్ర అధికారిక చిహ్నంలో కాకతీయ కళాతోరణం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఆయన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ... తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిగా మారింది అని విమర్శించారు. "ప్రముఖ కళాకారుడు అలె లక్ష్మణ్ తయారు చేసిన రాష్ట్ర రాజముద్రలో తెలంగాణ చరిత్రకి, సాంస్కృతిక వారసత్వానికి, గంగాజమునా తహజీబుకి ప్రతీకలైన కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటే అది రాచరిక పోకడనట. కానీ రాష్ట్ర గీతంలో మాత్రం అదే చార్మినార్ గురించి "గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్" అని పాడుకోవాలి!!?? "కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప" అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి!!?? అసలు ముఖ్యమంత్రికి గాని, ఆయన మంత్రిమండలిలో ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా?" అంటూ ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు."కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరికపు గుర్తులు కాదు. రాష్ట్ర అధికార చిహ్నం నుంచి వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నమైన కాకతీయ కళాతోరణం, చార్మినార్ ను తొలగిస్తే సహించేది లేదని, చిహ్నాలను తొలగిస్తే ప్రజాఉద్యమమేనని" కేటీఆర్ హెచ్చరించారు.

**రాజముద్ర మార్పుపై కాంగ్రెస్ స్పష్టత..**

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అణువణువు అమరుల త్యాగాల ఆనవాళ్లే ఉంటాయని పేర్కొంది. కానీ ఆ ఆనవాళ్లు మచ్చుకైనా లేని ముద్ర.. తెలంగాణకి రాజముద్ర ఎలా ఆపగలదంటూ ప్రశ్నలు సంధించింది. రాజముద్రలో ఉన్న మూడు సింహాలకి, రాజుల కాలంలో నిర్మించిన కట్టడాలకి ఏమైన సారుప్యం ఉందా అంటూ ప్రశ్నించింది. 'రాజ్యం తెచ్చిన నిజమైన



రాజులు ఎవరయ్యా అంటే మన తెలంగాణ అమరవీరులు. వారి ఉనికిని ప్రశ్నార్థకం చేసి, రాజ్యం ఏలే రాజులు.. మేమే తెలంగాణకు సర్వం.. సర్వస్వం అంటే ఊరుకునే ప్రసక్తే లేదు. ఎందుకంటే ఇది ప్రజా తెలంగాణ.. ఇక్కడ ప్రస్తుతం నడుస్తుంది ప్రజాపాలన. ప్రజా పాలనలో ప్రజలే మాకు దేవుళ్ళు.. వారి త్యాగాలే మాకు ఆనవాళ్ళు. ఆ ఆనవాళ్ళకు పట్టం కడుతూ మన రాజముద్రను వారి ఆశయాలకు అనుగుణంగా మార్చబోతున్నాం. జాతీయ సమగ్రత ప్రస్ఫురిల్లేలా.. తెలంగాణ ప్రాభవం ఉట్టిపడేలా.. ఉద్యమ ఉనికి కళ్ళకు కట్టేలా.. ప్రతి తెలంగాణ పౌరుడు ఇది మన రాష్ట్రం అనుకునేలా మన రాజముద్ర ఉండాలనేది ఈ ప్రజా ప్రభుత్వ సంకల్పం అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చింది.

**తుది రూపుపై సీఎం సమీక్ష...**

తెలంగాణ రాష్ట్ర చిహ్నం తుది రూపుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జూబిలీహిల్స్ లోని ఆయన నివాసంలో బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. పోరాటం, త్యాగాలు ప్రతిబింబించేలా రూపొందిస్తోన్న రాష్ట్ర చిహ్నం నమూనాలను పరిశీలించారు. ఈ సమావేశంలో కళాకారుడు రుద్ర రాజేశం, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం జేఏసీ నేత రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కి కౌంటర్...

రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణాన్ని తొలగిస్తే ప్రజా ఉద్యమం చేస్తామంటున్న కేటీఆర్ కి కూడా కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. "అరబుర్ర డ్రామారావుకు... గుంటూరులో చదివి ఉన్నమతి పోయినట్టుంది అంటూ ఎద్దేవా చేసింది. రాజముద్రని ఎందుకు మారుస్తున్నారో వివరించింది. "తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో త్యాగాలు ఉండాలి తప్ప... రాజ్య భోగాలు కాదు. అణచివేతపై ప్రజల తిరుగుబాటు కనిపించాలి తప్ప... నిజాం నిరంకుశ ఆనవాళ్లు కాదు. రాష్ట్రమంటే రాజ్యమని... అయ్య తర్వాత కొడుకుగా తనకే అధికారం దక్కాలని... భ్రమించే డ్రామారావుకు ఇది ఎప్పటికీ అర్థం కాదు" అని విమర్శించింది కాంగ్రెస్. రాష్ట్ర చిహ్నంలో ప్రజల త్యాగాలు ఉండాలా? రాజ్య భోగాలు ఉండాలా? సూటిగా చెప్పాలంటూ కేటీఆర్ ని ప్రశ్నించింది.

**వైరల్ అవుతోన్న రాష్ట్ర చిహ్నం నమూనాలు...**

తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేస్తోన్న నేపథ్యంలో సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు వైరల్ అయ్యాయి. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి నమూనాలను పరిశీలించారు. దీంతో ఆయన పరిశీలిస్తోన్న నమూనాలు అంటూ కొన్ని ఫోటోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.


# నిన్ను చంపేస్తాం..

**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ నేత, గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కు మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. దుండగులు.. చంపేస్తాం అంటూ కాల్ చేసి బెదిరిస్తున్నారని రాజాసింగ్ తెలిపారు. +66, +85, +88 ,+75 +25, ప్రైవేట్ నెంబర్ల నుండి ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వచ్చిన నెంబర్లను రాజాసింగ్ విడుదల చేశారు. కాగా, తనకు ఇలాంటి బెదిరింపు కాల్స్ రావడం కొత్త కాదన్నారు రాజాసింగ్. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ, బాధ్యతాయుతమైన పౌరుడిగా, ఈ పరిస్థితిని పోలీసు శాఖకు తెలియజేయడం బాధ్యతగా భావిస్తున్నా అని అన్నారు."నాకు కాల్ చేసి బెదిరిస్తున్న దుండగులకు సీఎం రేవంత్ రెడ్డి నెంబర్ ఇచ్చా. గతంలో అనేకసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నాకు ఉదయం నుండి వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. నీకు ఎన్ని నెంబర్లు ఉన్నాయి చెప్పాలంటూ అడిగిన వ్యక్తికి సీఎం రేవంత్ రెడ్డి నెంబర్ ఇచ్చాను. కనీసం సీఎంకు కాల్ చేసి బెదిరిస్తేనైనా పోలీసులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ ఉన్నారంటూ బెదిరిస్తున్నారు. ధర్మం కోసం పని చేస్తే నిన్ను, నీ ఫ్యామిలీని చంపేస్తామంటున్నారు. నాకు త్రెట్ కాల్స్ వస్తున్నాయని మరోసారి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు, తెలంగాణ డీజీపీకి లేఖలు రాశాను" అని రాజాసింగ్ వెల్లడించారు

# రూ.3 కోట్లతో జంప్

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ బోయిన్ పల్లిలో రూ.3 కోట్లతో ఉడాయించాడో వ్యక్తి. ఎస్బీఐ ఏటీఎంలో డిపాజిట్ స్కేర్ వాల్యూ సంస్థలో పనిచేస్తున్న లక్ష్మణ్.. సంస్థ డిపాజిట్ వాహనం నుంచి రూ.3 కోట్లతో పరారయ్యాడు. బోయిన్ పల్లిలోని ఏటీఎంలో లక్ష్మణ్ మనీ డిపాజిటర్ గా పని చేస్తున్నాడు. లక్ష్మణ్ పై సంస్థ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్బీఐ ఏటీఎంలో డబ్బు డిపాజిట్ చేసే ఓ సంస్థలో పని చేసే వ్యక్తి చేతివాటం ప్రదర్శించాడు. 3 కోట్ల రూపాయల డబ్బుతో అతడు ఎస్కేప్ అయ్యాడు. స్కేర్ వాల్యూ సంస్థ నగరంలోని ఎస్బీఐ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలలో నగదును జమ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా ఆ సంస్థ ఈ పని చేస్తోంది. అయితే, అదే సంస్థలో పని చేసే లక్ష్మణ్ 3కోట్ల రూపాయలు ఉన్న బ్యాగ్ ను ఎత్తుకెళ్లాడు. సిబ్బంది ఏటీఎంలో డబ్బు డిపాజిట్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. సిబ్బంది డబ్బు డిపాజిట్ చేయడంలో బిజీగా ఉండగా.. వాహనంలో ఉన్న డబ్బు బ్యాగుతో లక్ష్మణ్ ఉడాయించాడు. ఆ బ్యాగులో 3 కోట్ల రూపాయల నగదు ఉన్నట్లుగా తెలుస్తోంది. సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ వ్యక్తి ఎక్కడికి వెళ్లాడు? అతడి బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అనే వివరాలు తెలుసుకునే పనిలో పోలీసులు ఉన్నారు. సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. కాగా, లక్ష్మణ్ కొంతకాలంగా ఆ సంస్థలో పని చేస్తున్నాడని, నమ్మకస్తుడిగా పేరు తెచ్చుకున్నాడని వెల్లడించారు. స్కేర్ వాల్యూ సంస్థ సిబ్బంది 24 గంటల పాటు పని చేస్తారు. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ఎస్బీఐ బ్యాంకుకి చెందిన ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేస్తారు.

# కేసీఆర్‌ది దేశద్రోహమే..



**విశ్వంభర, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం దేశద్రోహానికి పాల్పడిందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు కేసీఆర్‌కు ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు. ఇది సామాన్య నేరం కాదని... దేశద్రోహం వంటిదే అన్నారు. ఈ కేసులో సూత్రధారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఢిల్లీ పెద్దల ఒత్తిడితో ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి రాజీపడ్డారని ఆరోపించారు. తానూ ట్యాపింగ్ బాధితుడే అయినప్పటికీ సీఎం ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. కాంగ్రెస్ పెద్దల ఒత్తిడితో కేసును నీరుగార్చవద్దని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులపై చర్యలు తీసుకోవడానికి రేవంత్ రెడ్డి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని తేలిపోయిందని వ్యాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఇండియా కూటమిలో చేరడం ఖాయమని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యేల కొనుగోలు చేశారనే అసత్య ఆరోపణలతో తమ పార్టీకి చెందిన ఢిల్లీ నాయకుడిని అరెస్ట్ చేసే ప్రయత్నం నాటి ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. ఢిల్లీ మద్యం కేసులో ఇరుక్కున్న కవితను ఎమ్మెల్యేల కొనుగోలు ద్వారా తప్పించే ప్రయత్నాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్ రావడం ఖాయమన్నారు. ఆగస్ట్ సంక్షోభం వస్తే తాము రక్షించేది లేదన్నారు.


# 1200 మంది ఫోన్లు ట్యాప్ చేశాం

(మొదటి పేజీ తరువాయి)

టాస్క్‌ఫోర్స్‌ను తనకు అందించారని చెప్పారు. ఎస్ఐబీలో రోజువారీ కార్యకలాపాలు కాకుండా ఎవరికీ చెప్పని పనులు తనకు చెప్పేవారని ఆయన పేర్కొన్నారు. ఎస్ ఐబీ కార్యాలయంలో మొదటి అంతస్తులో ప్రభాకర్‌రావు ఛాంబర్ పక్కనే తనకు రెండు గదులు కేటాయించారన్నారు. ఇందులో ఎస్ఐబీ ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు లాగర్ రూమ్‌లో సుమారు 56 మంది సిబ్బందితో పని చేసినట్లు పోలీసులకు వాంగ్మూలంలో వెల్లడించారు.

**సన్నిహితులకు పోస్టింగ్‌లు**

ఆ రెండు గదుల్లోని సిబ్బందికి 17 కంప్యూటర్లు, ప్రత్యేక సర్వర్లు ఏర్పాటు చేసినట్లు వాంగ్మూలంలో ప్రణీత్‌రావు తెలిపారు. ముఖ్యంగా ప్రభాకర్‌రావు రాజకీయ సంబంధమైన ప్రొఫైల్స్‌ను క్రియేట్ చేసే పనిని తమకు అప్పగించారన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష పార్టీల నాయకుల ప్రొఫైల్స్ క్రియేట్ చేయమని చెప్పేవారని తెలిపారు. ఇందు కోసం స్నేహితుడు, సామాజిక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్ గుండు వెంకట్రావు, చిన్ననాటి స్నేహితుడు బాలే రవి కిరణ్‌ను కూడా ప్రభాకర్



రావు సాయంతో ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేసుకున్నట్లు చెప్పారు. హెడ్ కానిస్టేబుళ్లు రఫీ, యాదయ్య. కానిస్టేబుళ్లు హరీశ్, సందీప్, మధుకర్ రావు ఉన్నారన్నారు. ప్రత్యేక ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకుని వాటి ద్వారా సుమారు 1000 నుంచి 1200 మంది ప్రొఫైల్‌లను క్రియేట్ చేశానని ప్రణీత్‌రావు వెల్లడించారు. అధికారికంగా మూడు, వ్యక్తిగతంగా మరో ఐదు చర వాణిలను ఉంచుకొని ప్రభాకర్‌రావు చెప్పిన వారిని ట్రాక్ చేసినట్లు చెప్పారు. 2022లో ప్రభాకర్‌రావు పదవీకాలం ముగియగా తెలంగాణ ప్రభుత్వం అతనని జూన్ 2023వరకు ఎస్ఐబీ చీఫ్‌గా మళ్లీ నియమించిందన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉండే వారి ప్రొఫైల్‌ను క్రియేట్ చేసి వారిని ట్యాప్ చేస్తూ మా బృందంతో కలిసి డబ్బులు సీజ్ చేశామన్నారు.

**ఎన్నికల కమిషన్‌కు అనుమానం రాకుండా..**

అయితే ఎన్నికల కమిషన్ నుంచి ఎటువంటి విమర్శలు రాకుండా వీటిని హవాలా డబ్బుగా రికార్డులో చూపించామని ప్రణీత్‌రావు వివరించారు. భుజంగరావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నల కు సమాచారన్ని అందించి కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నేతలకు చెందిన డబ్బుపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నాడు. ఇందుకు ఎంఎస్ కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ అందించిన సాఫ్ట్‌వేర్ వినియోగించినట్లు తెలిపారు. ఎవరినైతే టార్గెట్ చేశామో వారి సీడీఆర్, ఐపీడీఆర్, లోకేషన్ కోసం cat_usaer3idతో పాటు spsibintlnodal@tspolice.gov.in ద్వారా రిక్వెస్ట్ పెట్టేవాళ్లమని తెలిపారు.

**ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు బేగంపేట నాలాలో పడేశాం**

అందుకే పాత వాటిని ధ్వంసం చేసి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చినట్లు వివరించారు. ధ్వంసం చేసిన వాటిని నాగోల్, మూసారాంబాగ్ వద్ద మూసీలో పడేసినట్లు వాంగ్మూమిచ్చారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తం కాల్చివేశామని చెప్పారు. ఫార్మేట్ చేసిన ఫోన్లు, పెన్‌డ్రైవ్ లను బేగంపేట నాలాలో పడేసినట్లు వాంగ్మూలంలో ప్రణీత్‌రావు వెల్లడించారు.



# సేవాలాల్ చూపిన మార్గాన్ని అనుసరించాలి

- బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్
- సేవాలాల్ దీవెనలు ప్రజలపై ఉండాలి మంత్రి సీతక్క

**విశ్వంభర, హైదరాబాద్ మే 29 :** హైదారాబాద్ కొంపల్లిలో బుధవారం సంత్ సేవాలాల్ మహారాజ్‌ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారన్నారు. ఆయన పరమపదించి దాదాపు 200ల సంవత్సరాలు దాటినా కూడా సేవాలాల్ మహారాజ్‌ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంభించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన ఆదర్శ బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు

**విశ్వంభర, హైదరాబాద్ మే 29 :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, యారా ప్రముఖులు హాజరయ్యే ఈ ఆవిర్భావ వేడుకల నిర్వహణకు సికిందరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో వివిధ శాఖలు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టాయి. ఉదయం ముఖ్యమంత్రి గన్-పార్క్ లో అమరవీరుల స్థూపానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో హాజరయ్యే దాదాపు 20000 మంది ప్రజలకు, ప్రముఖులకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తాను జాగ్రత చర్యలు చేపడుతున్నారు. సభా ప్రాంగణంలో ప్రత్యేక మెడికల క్యాంపు, తాగునీటి సౌకర్యం, తగు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్ లు, కార్యక్రమ లైవ్ ప్రసారానికి ఏర్పాట్లు చేశారు.



### టాంక్‌బండ్‌పై కనులపండగగా..

జూన్ 2న సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, బాణ సంచా లేజర్ షో, ఫుడ్, గేమింగ్ స్టాళ్ళను ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు హాజరవుతారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళా బృందాలచే కార్నివాల్ ప్రదర్శనలు ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం 'జయ జయహే తెలంగాణ'పై జాతీయ జెండాలతో మార్చ్-ఫాస్ట్ జరుగనున్నాయి.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్ మే 29:** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జూన్ 1న సాయంత్రం 5 గంటలకు పబ్లిక్ గార్డెన్ కు 10 వేళ మంది చేరుకుంటారని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గన్ పార్క్ వద్ద కేసీఆర్ నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు 10 వేళ మందితో నిర్వహించే భారీ ర్యాలీలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటాని తెలిపారు. జూన్ 2న తెలంగాణ భవన్ లో జాతీయ జెండాతో పాటుగా పార్టీ జెండా ఆవిష్కరణ, కళింగ భవన్ లో ఫోటో ఎగ్జిబిషన్, జూన్ 3న ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాతో పాటుగా జిల్లా దవాఖానల్లో పండ్లు పంపిణీ చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర ఆమనగల్లు మే 29:** రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండ లం, గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం మొదటి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు యజ్ఞయాగాలతో వేదపండితుల మంత్రాలతో ఉప్పల చారిటబుల్ చైర్మన్ తలకొండపల్లి ఉప్పల వెంకటేష్ ఆద్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించే సాంకృత్తిక కారిక్రమంలో పాల్గొన్న చిన్నారులకు దుస్తుల పంపిణీ చేసి పేదల పక్షపాతి అని, అన్నా.. అంటే నేను ఉన్న అనే మాటలను నిజం చేస్తున్న ఉప్పల వెంకటేష్ మంచి మనుసును వన్దే మాతరం ,శృతిలయ సాంస్కృతిక పెద్దలు కొనియాడారు. కాగ రేపు జరిగే స్వామి కళ్యాణం ఊరేగింపులో కూడా వేలాది మంది భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటేష్ కోరారు.



# బాధితుడికి వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం

**విశ్వంభర, చింతపల్లి మే 29:** మండలంలోని చాకలిశేరిపల్లి గ్రామానికి చెందిన పగడాల పెద్దమ్మ ఉపాధి హామీ పని చేస్తూ.. అకస్మాత్తుగా కింద పడడంతో ఆమె కాలు విరిగింది. హైదరాబాద్ నవీన హాస్పటల్ లో చికిత్స పొందుతున్న పగడాల పెద్దమ్మను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆమె హాస్పటల్ ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. పెద్దమ్మ త్వరగా కోలుకోవాలని భగవంతుడి ఆశీస్సులు ఆమెపై ఉండాలి ఆయన కాంక్షించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మాచర్ల శ్రీశైలం తదితరులున్నారు.

# 4 గుట్కా బ్యాగులు స్వాధీనం

**విశ్వంభర, ఆమనగల్లు మే 29:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు బస్టాండ్ వెనుక భాగంలోని ఓ కిరాణా షాపులో ఇటీవల ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు షాపులో తనిఖీలు చేయగా 4 గుట్కా ప్యాకెట్లు లభించాయని, వాటిని స్వాధీన పరుచుకొని, దుకాణ యజమాని కొబ్బరికాయల సతీష్ ను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను ఎవరు అమ్మినా.. నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని



ఆమనగల్లు సిఐ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు.



తెలంగాణ అవతరణ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా ట్యాంక్ బండ్ నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

– విశ్వంభర, హైదరాబాద్

# లోయలో పడ్డ బస్సు..

## 28 మంది మృతి

**విశ్వంభర, కరాచీ :** పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ బస్సులో అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోయారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టా సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇక వివారాల్లోకి వెళ్తే.. టర్బాట్ నుంచి క్వెట్టాకు ఓ బస్సు వెళ్తోంది. కనుమ మార్గం గుండా ప్రయాణిస్తుండగా.. సడన్‌గా అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 28 మంది ప్రయాణికులు అక్కడిక్కడే మృతి చెందగా.. మరో 22 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు ఘటనాస్థలనానికి చేరుకున్న సహాయక సిబ్బంది సహయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇదిలాఉండగా.. ఇటీవల బాల్టిస్థాన్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. రోడ్డుపై వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 20 మంది చనిపోయారు.



# జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ సస్పెండ్

**విశ్వంభర, సిద్దిపేట :** జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే. శివప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ శాఖలో విధులు నిర్వహించే ఓ మహిళ ఉద్యోగి పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సదరు ఉద్యోగి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. ఘటన పై అప్పటి జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు విచారణ చేసి సదరు ఎంక్వయిరీ రిపోర్టును రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఇటీవల అందజేశారు. నివేదిక ఆధారంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం.








# దళిత మైనార్టీలపై రాజ్యాంగ వివక్ష

> మత రహిత రిజర్వేషన్లకు చిరునామా ఎక్కడ? అని ఓ పత్రిక వ్యాసంలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రాహుల్ కుమార్ అద్భుతమైన విశ్లేషణ చేశారు. అయితే చివరగా ఆయన ముగింపు పలుకుతూ.. రాజ్యాంగంలో ఫలానా మతం వారికి ఎటువంటి రిజర్వేషన్లు కల్పించకూడదనే నిబంధన ఎక్కడా కనపడదు అని రాస్తూ సామాజిక, విద్యా, వెనుకబాటు అందులో ప్రాతిపదికగా ఉంది. దీని వర్తింపులో మైనార్టీలను మినహాయించలేం అని ముగించారు. వాస్తవానికి అది అర్ధ సత్యం మాత్రమే. దళిత మైనార్టీలకు ఈ ముగింపు వర్తించదు.

భారత రాజ్యాంగంలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చెల్లవు అని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పారని చెబుతూనే.. అదే మత ప్రాతిపదికన దళిత క్రైస్తవ, ముస్లీంలకు రిజర్వేషన్లు నిరాకరిస్తున్నది. భారత రాష్ట్రపతి ఆర్మర్ 1950, పేరా '3' ప్రకారం హిందూమతం నుంచి క్రైస్తవ, ఇస్లామ్ మతం మారిన దళితులకు మాత్రమే రిజర్వేషన్లు రద్దు చేయడం లేదా బీసీ (సీ) కింద 1% శాతానికి తగ్గించడం ముమ్మాటికి రాజ్యాంగ వివక్షతే. అగ్రవర్ణ పేదలు క్రైస్తవులుగా మారితే వారికి కేటాయించిన 10% శాతం రిజర్వేషన్లు యదాతథంగా అమలు అవుతాయి. బీసీలకు 27%, చివరకు ఎస్టీలకు 7.5% అమలు అవుతున్నప్పుడు దళితులు హిందూ మతంలోనే ఉంటే తప్పా వారికి రిజర్వేషన్లు వర్తించవని చెబుతున్న నిబంధన వారి మానవ హక్కుల ఉల్లంఘనే కాకుండా వారి మత స్వేచ్చను కాలరాయడం అవుతుంది. స్వయంగా బాబాసాహెబ్ అంబేద్కర్ నేను హిందువుగా పుట్టడం నా చేతుల్లోలేదు కాని హిందుగా మరణించను అని హిందుమత బానిస సంకెళ్ళు తెంచుకొని అశోక విజయదశమి రోజున బౌద్ధ మతం స్వీకరించారు. భారత రాజ్యాంగ అధికరణ 341లో ఎక్కడా "మత" ప్రస్తావన లేనప్పటికీ, రిజర్వేషన్లకు పునాది కులవివక్షత, అంటరానితనం. హిందూ మతంలో వర్ణాశ్రమ కుల సంప్రదాయాల పునాదిగా ఏర్పడిన అంటరానితనం, కుల వివక్షత కారణంగా హిందూమతంలో ఉండలేక కోట్లాది మంది దళితులు క్రైస్తవులు, ముస్లీములుగా మతం మార్చుకున్నారు. అయినప్పటికీ పెనంలో నుండి పొయ్యిలో పడినట్లు ఆ మతాల్లో కూడా హిందూమతంలాగా కుల వివక్షతను, అంటరాని తనాన్ని ఎదుర్కొంటున్నారు దళిత క్రైస్తవ, ముస్లీములు. స్వదేశంలో పుట్టి హిందూమతంలో భాగంగా పిలువబడుతున్న సిఖ్ మత దళితులను 1956లో బుద్ధిస్ మత దళితులను 1990లో షెడ్యూల్ కులాలుగా గుర్తిస్తూ 1950, ఆర్డర్ను సవరించి విదేశీ మతాలైన ఇస్లామ్, క్రైస్తవ మతాల దళితులను షెడ్యూలుగా గుర్తించడానికి 78 ఏళ్ల స్వతంత్ర భారతం, 75 ఏళ్ల స్వతంత్ర రాజ్యాంగం అంగీకరించడం లేదు. మరి ఒసి/బిసి/ఎస్టీ క్రైస్తవులను ఎలా అంగీకరిస్తున్నారు? వారిది విదేశీ మతం కాదా? వారు అంటరాని వారు కాదనా? దళితులు మాత్రమే క్రైస్తవం ఇస్లామ్ తీసుకుంటే హిందూ మతం అంతరించిపోతుందా?

ఆర్థిక ప్రాతిపదికన పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తే ఆర్థిక అసమానతలు తొలగిపోయేవికుల నిర్మూలనే తన ధ్యేయంగా ప్రకటించి దాని నిర్మూలన కోసం తన జీవిత కాలం పోరాటం చేసి, అనేక పుస్తకాలు వ్రాసిన రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్ డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ అధికరణ 17లో అంటరానితన నిర్మూలనకు బదులు కులాన్ని నిర్మూలించే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించి ఆ దిశగా చట్టాలు రూపొందిస్తే కుల, వర్ణ అంతరాలు తొలగి సామాజిక సమానత్వం దిశగా భారత్ అడుగులు వేసేది కదా? ఎప్పుడైతే కుల నిర్మూలన జరుగుతుందో అప్పుడు ఆర్థిక ప్రాతిపదికన పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తే ఆర్థిక అసమానతలు తొలగిపోయేవి. అలాగే జనాభా దామాషా పద్ధతిలో పేద, మధ్య తరగతి ప్రజలకు సంపద పంపిణీ చేస్తే భారత దేశం ఏనాడో అమెరికా కంటే అగ్ర దేశంగా ప్రపంచ పటంలో గుర్తించబడేది. సామాజిక, ఆర్థిక, సమానత్వం సాధించడమే రాజ్యాంగం యొక్క ముఖ్య కర్తవ్యం. రాజ్యాంగ పరంగా అందరం సమానమే కులం, మతం, వర్ణం, వర్గం, జాతి, లింగ భేదాలు లేకుండా మనిషికి ఒకే ఓటు, ఆ ఓటుకు ఒకే విలువ ఉంటుంది. కానీ సామాజికంగా, ఆర్థికంగా సమానత్వం సాధించే వరకు రాజకీయ ప్రజాస్వామ్యానికి అర్థం లేదు అంటాడు డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్. 78 సం॥రాల స్వతంత్ర్యం తర్వాత కూడా దళితులకు స్వేచ్చా సమానత్వం వారి గూడాల్లోకి రాలేదు. సొంత కూడు, గూడు, గుడ్డ చివరకు స్మశాన వాటికలు సయితం దళితులకు ఈ దేశంలో లేవు. భారత పౌరులందరికీ మత స్వేచ్చ ఉండి ఒక్క దళితులకే ఎందుకు నిషేదించబడినది? దళితుడైన బాబా సాహెబ్ అంబేడ్కర్ వ్రాసిన రాజ్యాంగం ద్వారా దళితులకు రక్షణ లేకపోతే దళితులకు దిక్కెవరు? అందుకే రాజ్యాంగ వివక్షతను దళిత క్రైస్తవ, ముస్లీముల పట్ల అనుసరిస్తున్న రాష్ట్రపతి ఆర్డర్ 1950, పేరా నెం. 3 రాజ్యాంగబద్ధమా? వ్యతిరేకమా? అనే దేశవ్యాప్త చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకొని ఏ విధంగానైతే జాతి విక్షతను నిర్మూలించినట్లే భారత దేశంలో కులవివక్షత నిర్మూలించి, దళితుల మత స్వేచ్ఛతో పాటు మానవ హక్కుల్ని కాపాడాలి. అందుకు ప్రపంచ దేశాలు జోక్యం చేసుకోవాల్సిన తక్షణ కర్తవ్యం వారిపై ఉంది.



- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్
మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా "ఉస్మానియా & తెలంగాణ విశ్వ విద్యాలయం,
ఫోన్: 93901 19889

# ట్రాన్స్‌కోలో నాణ్యత పరికరాలను వాడాలి

**విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌కోలో నాణ్యతలేని పరికరాలను, కాసారాలను వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి డిమాండ్ చేస్తుంది.**

**విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌కో విభాగం విద్యుత్ పంపిణీకి సంబంధించి విద్యుత్తును వినియోగదారుడికి అందించే క్రమంలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయడం, నూతన ఇనుము (ఐరన్) తో తయారు చేయబడిన కాసారాలు, వికాసారాలు, ఎక్కువగా వినియోగిస్తున్నారు.**



ఈ కాసారాలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తయారు చేసి నాణ్యమైనవి సరఫరా చేయాల్సి ఉండగా.. డిమాండ్ కు తగినట్లు అనుమతి పొందిన కాంట్రాక్టర్లు సకాలంలో తయారుచేసి ఇవ్వడం లేదు. నాణ్యతగల పరికరాలు, కాసారాలు సకాలంలో అందకపోవడం వల్ల ట్రాన్స్‌కో చేయాల్సిన విస్తరణ పనుల్లో పరికరాల కొరత ఏర్పడిన సమయంలో బహిరంగ మార్కెట్లో అట్టి పరికరాలను ప్రభుత్వం నిర్ధారించిన రేట్లకు కాంట్రాక్టర్లు కొనుగోలు చేసి వాడేందుకు అనుమతులు ఇచ్చారు. దీనిని ఆసరాగా చేసుకుని నాసిరకం పరికరాలను, కాసారాలను కాంట్రాక్టర్లు ఫీల్డ్ లో భిగిస్తున్నారు. నాసిరకం పరికరాలు కొద్దీ కాలంలోనే పాడైపోవడం సహజం.

కొత్త ఇనుములో ఉండాల్సిన సామర్థ్యం పాత ఇనుము (ఐరన్)లో వుండదు..దీనివల్ల పాత ఇనుముతో తయారు చేసిన పరికరాలు, కాసరాలు వాడడం వల్ల కొద్దీ కాలంలోనే అవి పాడై పోవడం, విరిగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. పోల్స్ విరిగిపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం తోపాటు పునరుద్ధరించడానికి అయ్యే పూర్తి ఖర్చు ట్రాన్స్‌కో పై పడుతుంది.ఈ విషయాన్ని విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదు.

విద్యుత్ ప్రమాదాల వల్ల మనుషులకు, జంతువులకు ప్రాణహాని జరగడంతో వాటికి నష్ట పరిహారం చెల్లించడంతో అధిక బారం పడుతుంది. విద్యుత్ సంస్థకు సంబంధించిన పోల్స్ డామేజ్ కావడం వల్ల విద్యుత్ సంస్థకు ఆర్థిక భారం, నిర్వహణ వ్యయం పెరుగుతుంది.

ఈ సమస్యలన్నిటికీ ప్రధాన కారణం నాసిరకం పరికరాలు, పాత ఇనుముతో తయారుచేసిన కాసారాలు వాడడం. దీనిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే ఫీల్డ్ లో బిగించేలా సంబంధిత పర్యవేక్షణ అధికారులు కఠిన నిబంధనలను అమలుపర్చాలి.

సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఫీల్డ్ లో బిగించే పరికరాలను కాసారాలను పరిశీలించి నాణ్యత గలవి అని నిర్ధారించిన తర్వాత మాత్రమే వాటిని కాంట్రాక్టర్లు వినియోగించి విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదేవిధంగా విద్యుత్తు సరఫరాకు వాడే పోల్స్ పై వివిధ రకాల తీగజాతి మొక్కల తీగలు పారకుండా, చెట్ల కొమ్మలు తగలకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులదే అని ఆదేశాలు జారీ చెయ్యాలి.

విద్యుత్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయడం వల్ల జరిగే ప్రమాదాలకు ప్రాణ నష్టాలకు ఆస్తి నష్టాలకు సంబంధిత పరిధిలోని విద్యుత్ శాఖ ఉద్యోగులది అని ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఉద్యోగులు విధులను సమర్ధవంతంగా నిర్లక్ష్యం లేకుండా నిర్వహిస్తారు.

పై విషయాలను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్ కో విభాగంలో వృథా అవుతున్న ప్రజా ధనం అరికట్టాలి. నాణ్యత లోపాలతో గల పరికరాల వాడకాన్ని అడ్డుకోవాలి.

విద్యుత్ ట్రాన్స్‌కో నిర్వహణలో ప్రజాధనం వృథాను దుర్వినియోగాన్ని అరికట్టడం ద్వారా విద్యు త్ శాఖకు, వినియోగదారులకు భారం పడకుండా ఉంటుంది. విద్యుత్ శాఖలో విద్యుత్ చౌర్యంపై థర్డ్ పార్టీ విచారణలు చేసిన విధంగా కేసులు నమోదు చేయడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. అదే విషయాన్ని పరిగణలోకి తీసుకొని విద్యుత్ ట్రాన్స్‌కో ద్వారా ఫీల్డ్ లో బిగిస్తున్న పరికరాలను థర్డ్ పార్టీ ద్వారా క్వాలిటీని పరిశీలించే విధానాన్ని అమలు చేయాలి. అదే విధంగా విద్యుత్ పోల్స్ పై అనుమతి లేకుండా కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ వ్యాపారులు అనధికారికంగా పోల్సును వాడుకుంటున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ నష్టాలను కొంత అరికట్టవచ్చు. విద్యుత్ పోల్స్ వాడుకోవడానికి అనుమతులు కోరిన వారికి తగిన రుసుమును తీసుకొని వాడుకునే సౌకర్యాన్ని ఇచ్చినట్లయితే విద్యుత్ శాఖకు కొంత ఆదాయం వస్తుంది. తద్వారా వినియోగదారులపై భారం వేయకుండా వీలైనంత తక్కువ రేటుకు విద్యుత్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అధిక భారం ప్రజలపై పడకుండా వుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు వీలైనంత త్వరగా పై చర్యలు తీసుకుంటారని తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి డిమాండ్ చేస్తుంది. ప్రజల పక్షాన ప్రజలపై భారం పడకుండానే విద్యుత్ రంగ సంస్థలు తయారీ సంస్థలు సరఫరా సంస్థలు లాభాల బాటలో నడిచేలా చూసే అవకాశం కలదు దీనిపై సంబంధిత మంత్రులు పాలకులు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



- డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి,
ఎంఏ, ఎంసీజే, ఎల్ఎల్‌బీ
సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు
ఫోన్ : 99496 49766

> దాసరి నారాయణరావు ( మే 4, 1947 - మే 30, 2017) కళాశాలలో చదివే రోజులలో బీ.ఏ డిగ్రీతో ఉత్తీర్ణులు కావడంతో పాటు అనేక నాటక పోటీలలో కూడా పాల్గొనేవారు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందారు. మోహన్ బాబు, ఆర్. నారాయణమూర్తి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి తదితర నటులు, దర్శకులు, ఎందరో సాంకేతిక నిపుణులను దాసరి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. సినీ రంగానికి పరిచయం చేసి ఎదిగేందుకు చేయూత అందించారు. ఒక సమయంలో ఆయన పేరిట తెలుగు నేలపై 18వందలకు పైగా దాసరి అభిమాన సంఘాలు ఉండేవంటే సామాన్యం కాదు.



# తెలుగు చిత్రసీమలో దాసరిది నూతన ఒరవడి

## మే 30.. దర్శక రత్న దాసరి నారాయణ రావు వర్ధంతి

తెలుగు సినిమా రంగంలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. చిత్ర నిర్మాణంలో ఏ విభాగంలోనైనా ఆయనది ప్రత్యేక శైలి. అయన ప్రత్యేక గుర్తింపు పొందిన సినిమా దర్శకులు, విలక్షణ నటులు, గీత, సంభాషణ రచయిత, చిత్ర నిర్మాత. అత్యధిక చిత్రాల దర్శకునిగా తెలుగు, హిందీ భాషల్లో 151 సినిమాలకు దర్శకత్వం వహించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకి ఎక్కారు. గిన్నిస్ బుక్ లో స్థానం పొందారు. 53 సినిమాలు స్వయంగా నిర్మించారు. 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా పని చేశారు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా అవార్డులను పొందారు. అంతేకాదు రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు.

ఆదుర్తి సుబ్బారావు దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా, శిష్యరికం చేసి సినిమా దర్శకత్వంలో తనకంటూ ఓ ప్రత్యేకశైలిని అలవర్చుకున్నారు. తర్వాత భిన్నమైన చిత్రాలను రూపొందించారు. 1974లో తాతా మనవడు సినిమాతో సినీ ప్రస్థానం ప్రారంభించిన దాసరి తొలి సినిమాకే నంది అవార్డు అందుకొని సంచలనం సృష్టించారు. మేఘ సందేశం చిత్రాన్ని కేన్స్, షికాగో, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. 1974లో తాతా మనవడు చిత్రానికి నంది అవార్డు, స్వర్గం నరకం సినిమాకు ఉత్తమ చిత్రంగా బంగారు నంది బహుమతి , 1983లో మేఘ సందేశం చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు, 1992లో మామగారు చిత్రానికి గాను ఉత్తమ నటుడు నంది అవార్డు, 1986లో తెలుగు సంస్కృతి , తెలుగు చిత్ర రంగంనకు ఆయన చేసిన సేవలకు గాను ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఫిల్మ్ ఫేర్ అవార్డు 6 సార్లు, మద్రాసు ఫిల్మ్ ఫాన్స్ అవార్డ్ 5 సార్లు, సినీ హెరాల్డ్ అవార్డ్ 10 సంవత్సరాలు వరసగాను పొందారు. జ్యోతిచిత్ర నుండి సూపర్ డైరెక్టర్ అవార్డ్ కు 3 సార్లు, పాత కాలం నాటి ఆంధ్రపత్రిక నుండి ఉత్తమ దర్శకుడిగా 6 సార్లు ఎంపిక అయ్యారు.

రామోజీ రావు వార్తాపత్రిక ఈనాడుకు ధీటుగా భావించి ఉదయం దినపత్రికను ఆయన ప్రారంభించి, కొత్త జర్నలిజానికి పురుడు పోశారు. ఎందరినో జర్నలిస్టులు తీర్చిదిద్దారు. రాజీవ్ గాంధీ పాలనా కాలములో, దాసరి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఔత్సాహికులై ఎన్నికల ప్రచారము సాగించారు. 1990 దశకం చివరిలో ఆయన తెలుగు తల్లి పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. తర్వాత మాత్రం కాంగ్రెస్ పార్టీకి అనుకూలురై, కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. బొగ్గు, గనుల శాఖకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు.

- రామకిష్టయ్య సంగనభట్ల
ఫోన్ : 9440595494

# దైవ సమానులు.. గుండి రాజర్షి



ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్టతో, నిత్య భాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్ధిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలుగాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింప బడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి.

భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్థ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింపజేశారు, ఆపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి... వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జెమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు" గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు నిత్య జ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం.



# రాష్ట్రంలో మూడు రోజులు మద్యం బంద్

**విశ్వంభర, విజయవాడ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 4న రానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యగా మూడు రోజుల పాటు వైన్స్ షాపులను బంద్ చేయాలని ఆదేశించింది. జూన్ 3 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మద్యం షాపులను మూసివేయాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. దీంతో పాటు ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ చెప్పారు. హోటళ్లు, లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని జిల్లాలోని పోలీసులకు ఆదేశించారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఉంటే అదుపులోకి తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాపై కూడా నిఘా పెట్టాలని తెలిపారు. అల్లర్లకు ప్రేరేపించేలా.. రెచ్చగొట్టేలా ఎవరైనా పోస్టులు పెడితే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీలో పోలింగ్ రోజు నుంచి మూడు రోజుల పాటు హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో.. కౌంటింగ్ పోలీసులకు సవాల్ గా మారింది. కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్సీ రిపోర్టులు కూడా ఉన్నాయి. దీంతో.. పోలీసులు అప్రమత్తం అవుతున్నారు.

# వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ మే 29:** నియోజకవర్గ పరిధిలోని వరదనీటి సమస్యలు పరిష్కరిస్తానని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పక్కకాలనీ నుంచి వచ్చే వరదనీరు వల్ల తన యొక్క కాలనీల నందు ఇండ్లు, కమ్యూనిటి కేంద్రాలు, దేవాలయం నీట మునుగుతున్నాయని ఎమ్మెల్యేకు తమ ఆవేధన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కాలనీ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గతంలోనే ట్రంక్ లైన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ట్రంక్ లైన్ నిర్మాణంలో భాగంగా పక్కన ఉన్న ఒక ప్రైవేట్ స్థలం అడుగగా వారు నిరాకరించారని, దానితో కొంత మేర పనులు ఆలస్యం జరిగిందన్నారు. అప్పుడే అక్కడికి విధి నిర్వహణలో భాగంగా అక్కడికి వచ్చిన అధికారులకు నూతన ట్రంక్ లైన్ పనుల్లో ఎత్తుపల్లాలు చూసుకొని పనులు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పనుల్లో బాగంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆయన కోరారు. నియోజకవర్గ పరిధిలోని వరదనీటి సమస్యలు తప్పకుండా పరిష్కారం చేయడం జరుగుతుందని, ఆ పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని వాటికి కాలనీవాసులు తమ సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు దీపావళి శ్రవణ్, దీపావళి శ్రీకాంత్, కాలనీవాసులు సుధీర్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్ రెడ్డి, మురళి, శంకర్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## చైల్డ్ ట్రాఫికింగ్ కేసు కోసం
# ఢిల్లీకి తెలంగాణ పోలీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనంగా మారిన చైల్డ్ ట్రాఫికింగ్ కేసుపై పోలీసులు ఫోకస్ చేశారు. చిన్నారులను అమ్మకానికి పెడుతున్న ముఠా కోసం రాచకొండ పోలీసులు ఢిల్లీకి వెళ్లారు. ఈ కేసులో కిరణ్, ప్రీతి అనే ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకూ 50 మంది చిన్నారులను ఈ ముఠా అమ్మేసినట్టు తేల్చారు. ఇటీవల పోలీసులు 16 చిన్నారును కాపాడి సీడబ్ల్యూసీకి తరలించారు. ఈ కేసులో 11 మందిని అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. పిల్లలను ఎక్కడ నుంచి తీసుకొని వస్తున్నారు? ఇందంతా ఎవరు చేస్తున్నారనే దానిపై ఫోకస్ చేశారు. చిన్నారులను విక్రయిస్తున్న ముఠాల కోసం ఢిల్లీలో కోసం గాలింపు చేస్తున్నారు. చిన్నారుల విక్రయ వ్యవహారం మేడిపల్లిలో వెలుగులోకి వచ్చింది. పీర్జాదిగూడలో 5 రోజుల క్రితం రూ. 4.50 లక్షలకు ఆర్ఎంపీ డాక్టర్ శోభారాణి శిశువును విక్రయించారు. అప్పుడే శోభారాణితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. చైల్డ్ ట్రాఫికింగ్ గుట్టు బయటపడింది. ఢిల్లీ, పుణె నుంచి చిన్నారులను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.


ఈ ముఠా తల్లిదండ్రుల నుంచి పిల్లలను కొనుగోలు చేసి.. రూ. 1.80 లక్షల నుంచి రూ. 5.50 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు రాచకొండ సీపీ తెలిపారు.

# ఉద్యమించిన జర్నలిస్టులను గుర్తించాలి

**తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి**



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన జర్నలిస్టులను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గుర్తించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి బుధవారం విడుదల చేసిన ఒక ప్రత్యేక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఉద్యమాలను ప్రపంచ నలుమూలలకు తెలిసేలా చేసింది జర్నలిస్టులు మాత్రమే అన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారస్తులు, కవులు, కళాకారులు, రచయితలు ఇలా సబ్బండ వర్గాల వారు చేసిన ఉద్యమాలను చూసి నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించడం, దాని వెనుక ముమ్మాటికి జర్నలిస్టుల పాత్ర మాటలకు అందనిది అన్నారు. రాష్ట్రంలో అన్ని జర్నలిస్టు సంఘాల వారు ప్రత్యక్ష పరోక్ష ఉద్యమాలలో పాల్గొని రాష్ట్రం సిద్ధించడానికి ప్రధాన కారకులు అయిన సంగతి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రభుత్వాలు మర్చిపోవద్దు అని యాదగిరి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని ప్రత్యేకంగా ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలైనా రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల బతుకులు మాత్రం ఏమీ మారలేదు అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యచరణ తెలిపారు. ఇందుకోసం జర్నలిస్టులు అందరూ సంఘాలకు అతీతంగా సమయాత్తం కావాలని పిలుపునిచ్చారు



# తెలంగాణలో 10 సీట్లు గెలుస్తాం : అమిత్ షా

**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్రంలో మూడోసారి గెలిచి తాము హ్యాట్రిక్ కొట్టబోతున్నామని కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా 400 పైచిలుకు స్థానాల్లో సత్తా చాటబోతున్నట్లు జోస్యం చెప్పారు. ఇటీవల ఆయన ఓ మీడియా ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సౌత్ లోనూ మంచి ఫలితాలు చూస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక తెలంగాణలో 10 సీట్లు గెలుస్తామనే నమ్మకం ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని అన్నారు. అటు దక్షిణాదిలోను ఐదు రాష్ట్రాలు, తూర్పు భారత్ రాష్ట్రాల్లో తాము పెద్ద పార్టీ అవతరిస్తామని తెలిపారు. ఒడిశాలో 17 లోక్ సభ సీట్లు, 75 అసెంబ్లీ సీట్లు టార్గెట్ పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.



# ముగ్గురు మావోయిస్టులు మృతి

**విశ్వంభర, భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది. ఆమె పేరు మనీలా అని ఆమె పై ఎనిమిది లక్షల రూపాయల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. మనిలాతో సహా ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం వద్ద ఆయుధాలు, పేలుడు పదార్థాలు, విప్లవ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఛత్తీస్ గఢ్, దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్, పోలీస్ అధికారుల ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరంతా గతంలో పలు వి ధ్వంసకర సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యులుగా పోలీసులు తెలిపారు. ఛత్తీస్ గఢ్, సుకుమా జిల్లా, కేర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిమెల్ అటవీ ప్రాంతంలో ఒక మహిళ మావోయిస్టును పోలీసులు అరెస్ట్ చేశారు.

# బెంగళూరుకు ప్రజ్వల్ రేవణ్ణ రాక



**విశ్వంభర, బెంగళూరు :** బీజేపీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఈ నెల 31వ తేదీ తెల్లవారుజామున కర్ణాటక కు చ తెలుస్తోంది. నేడు జర్మనీ నుంచి బెంగళూరు బయలుదేరనున్నారు. అయితే ఎయిర్ పోర్టులోనే ప్రజ్వల్ ను పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా కర్ణాటక నుంచి పోటీ చేసిన ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక, ఎన్నికల నేపథ్యంలో ఆయనకు సంబంధించిన అభ్యంతరకర వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చాయి. అనంతరం బాధిత మహిళలు ఒక్కొక్కరిగా బయటకు వచ్చి ఆయనపై ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటకలో ఆయనపై అత్యాచారం, కిడ్నాప్ కేసు నమోదైంది. అంతకుముందు..ఏప్రిల్ 27న ప్రజ్వల్ దేశం విడిచి జర్మనీకి వెళ్లిపోయారు.



# ఎమ్మెల్యేకు బ్రహ్మకుమారిస్ సన్మానం

**విశ్వంభర, కల్వకుర్తి మే 29:** నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ మరియు కల్వకుర్తి ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఐశ్వర్య విశ్వ విద్యాలయ ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాము చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. దానికి ఎమ్మెల్యే స్పందించి మీరు చేసే కార్యక్రమాలకు మద్దతు ఇస్తానని తెలిపారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని సన్మానించడం జరిగింది.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

**రాష్ట్ర అవతరణ దినోత్సవంపై కలెక్టర్ శశాంక సమీక్ష**



**విశ్వంభర, ఆమనగల్లు మే 28 :** జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పని చేస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ శశాంక రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవంణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో అధికారులు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకల్లో పోలీసు బందో బస్త ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు, పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ ప్రమీల రాణి, సీపీఓ సౌమ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**విశ్వంభర, కల్వకుర్తి మే 29:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో ఇటీవల మరణించిన వికలాంగుల సంఘం నేత పెరుమాళ్ల కృష్ణ కుటుంబానికి మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు వ్యక్తిగతంగా 40వేల రూపాయలు అందించారు. అలాగే గ్రామ నాయకులు కలిసి మరో 30వేల రూపాయలు పోగు చేసి మృతుడి భార్య అలివేల, కూతురు నిత్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం చైర్మెన్ కొమ్మగోని రవిగౌడ్, వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు గుమ్మకొండ బాల్ జంగయ్య, మహేంద్రం, హెూమ్ గార్డ్‌ల సంఘం అధ్యక్షుడు కృష్ణ, నాయకులు మోక్తాల బాల్‌జంగయ్య, యాదయ్య, దార పాండు, రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.




## సూర్యాపేట ఎస్పీ పేరుతో
# నకిలీ ఖాతా

**విశ్వంభర, సూర్యాపేట :** సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డు ఆపు లేకుండా పోతుంది. సెలబ్రిటీలు, అధికారులు, ప్రభుత్వ పెద్దల సోషల్ మీడియా అకౌంట్స్ కూడా హ్యాక్ చేస్తున్నారు. కొంతమంది వారి పేరుతో నకిలీ ఖాతాలు ఓపెన్ చేస్తున్నారు. ఆ తర్వాత డబ్బులు కావాలని మెసెజ్‌లు చేస్తున్నారు. ఇలా పోలీసు, ఐఏఎస్ అధికారులు, రాజకీయ నేతల సోషల్ మీడియా అకౌంట్లతో ఫేక్ ఖాతాలు క్రియేట్ చేసి వారిలా చాట్ చేసి అమాయకులకు వల వేస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవలే తెలంగాణ డీజీపీ రవిగుప్తా పేరుతో వాట్సాప్ అకౌంట్ క్రియేట్ చేశారు. ఇదో సంచలనం అయింది. తాజాగా సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే వంతు వచ్చింది. రవిగుప్త పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా క్రియేట్ చేశారు సైబర్ కేటుగాళ్లు. ఎస్పీ సూర్యాపేట అనే అకౌంట్ క్రియేట్ చేసి.. ఈ నకిలీ ఖాతా నుంచి మెసేజ్‌లు, ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఇది రాహుల్ హెగ్డే దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన సూర్యాపేట అకౌంట్ నుంచి మెజేజ్‌లు వస్తే ఎవరూ స్పందించవద్దని తెలిపారు. ఎవరూ డబ్బులు పంపవద్దని సూచించారు. నకిలీ ఖాతాలు క్రియేట్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సూర్యాపేట మెడికల్ క్లినిక్‌లలో
# మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులు

**విశ్వంభర, సూర్యాపేట :** అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యానికి నష్టం కలిగించే మెడికల్ క్లినిక్లపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, లీగల్ అండ్ ఆంటీ క్వకరి మెంబర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు మెడికల్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి విద్యార్హతలు లేకుండా ఫస్ట్ ఏయిడ్ సెంటర్లను మెడికల్ క్లినిక్లుగా మార్చి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మోతాదుకు మించి యాంటీబయటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు తెలుస్తుందన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడడంతో కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ క్లినికులు నిర్వహించే వారిపై 34, 54 ఎన్.ఎం.సి యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు లక్ష నుంచి 5 లక్షల వరకు జరిమానా, సంవత్సరం పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ప్రజలు సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో కానీ,ఎంబిబిఎస్ చదివిన వైద్యుల వద్ద కానీ చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేష్ సిబ్బంది తదితరులు ఉన్నారు.





## ఉచిత కంటి పరీక్ష కేంద్రం ప్రారంభం

**విశ్వంభర, బాలానగర్ :** వాసవి డయాగ్నోస్టిక్ సెంటర్ వైకేఆర్ బాలానగర్ కంటి దవాఖాన సహకారంతో బుధవారం సాధారణ ప్రజలకు ఉచిత కంటి పరీక్ష విజన్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీన్ని ఎరుకుల్ల రామకృష్ణ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రారంభించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుబోధ్ గుప్తా, కోశాధికారి మహంకాళి ఉమామహేశ్వర్, చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతులు పూర్తి చేయాలి

**మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**

**విశ్వంభర, నారాయణఖేడ్ మే 29 :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పాఠశాలలు తెరిచేలోగా పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం పాపన్నపేట్ మండలంలోని పొడిచిన పల్లి, ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా సందర్శించి అమ్మా ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించరు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఆయా స్కూళ్ళలో మరమ్మతు పనులు పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. స్కూళ్ళలో నీటి సరఫరా, విద్యుత్ పరికరాల ఏర్పాటు, మరుగుదోడ్ల మరమ్మతు, నీటి సదుపాయం, పాఠశాలల ఆవరణలో మరమ్మతులు త్వరగా చేయాలన్నారు. పనులపై ఆయా మండలాలు మున్సిపల్ పరిధిలో ఎన్ని స్కూళ్ళలో పనులు మొదలు పెట్టారు? ఎన్ని పూర్తి అయ్యాయో చర్చించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు. పాపాన్నపేట్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, నాగరాజు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సురవరం ప్రతాపరెడ్డి పూర్తి జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

**శాంతా బయోటెక్స్ ఎండీ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి**



**విశ్వంభర, హిమాయత్ నగర్ :** తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పూర్తి జీవిత చరిత్రను నేటి తరానికి అందించటానికి పాఠ్యాంశాలలో చేర్చాలని శాంతా బయోటెక్స్ ఎండీ డాక్టర్ కే ఐ వరప్రసాద్ రెడ్డి కోరారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి సురవరం పేరుతో ప్రత్యేక సాహిత్య అవార్డును ప్రదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బుధవారం సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి సందర్భంగా సాహితీ పురస్కారం 2024ను ప్రముఖ పాత్రికేయులు ఉడయవర్లకు ప్రదానం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్య రంగంలో కొత్త చరిత్రను సృష్టించిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. కవి ఇంకొక కవిని తయారు చేయడని సురవరం ప్రతాపరెడ్డి మాత్రం ఎంతోమంది కవులను తయారు చేసి కొత్త ఒరవడిని సృష్టించారని అన్నారు. నిజాం రాజుల కాలంలో గొంతు విప్పి తెలంగాణ గళాన్ని వినిపించారని, ఆ వారసత్వాన్ని నేటి రచయితలు కొనసాగించాలని కోరారు. జర్నలిస్టుకు అవార్డు ప్రదానం చేయడం అభినందనీయ మని, సాహిత్య రంగంలో కూడా మరో అవార్డును ఇవ్వాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని వరప్రసాద్ రెడ్డి వెల్లడించారు. అవార్డు గ్రహీత సీనియర్ పాత్రికేయులు తిరునగరి ఉడయవర్లు మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. తెలుగు సాహిత్య రంగానికి సురవరం శిఖరం లాంటి వ్యక్తి అని కొనియాడారు. బతుకమ్మ, బోనా లు వినాయక చవితి వేడుకలపై ప్రత్యేక వ్యాసాలు రాశానని ఆయన గుర్తు చేశారు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరహత్ అలీ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి, సోయాబుల్లా కానులు నేటి జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ అవార్డు ప్రధాన ఉత్సవానికి అధ్యక్షత వహించిన సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డిని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సురవరం పుష్పలత, చెన్నయ్య పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



**విశ్వంభర, నారాయణఖేడ్ మే 29:** రైతులకు ఎరువుల డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన ప్రదేశంగంపేటలో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి ఆదేశాల మేరకు శంకరంపేట్ గ్రామంలోని ఫెర్టిలేజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను ఎరువుల దుకాణ యజమానులు మోసం చేస్తే ఊరుకునేది లేదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాల్సిందేనన్నారు. రైతులు కూడా దుకాణాల నుంచి కొనుగోలు చేసిన సంబంధింత రసీదులను విధిగా తీసుకోవాలని పేర్కొన్నారు. దుకాణం డీలర్లు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు నకిలీవి విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శంకర్ పేర్కొన్నరు. ఆయన తోపాటు అగ్రికల్చరల్ ఆఫీసర్ రాజేష్ , ఏఎస్ఐ డీ శంకర్ ఉన్నారు.

## సేవా సంస్థలకు అండగా ఉంటాం

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి**



**విశ్వంభర, నారాయణఖేడ్ మే 29:** ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సంస్థలకు అండగా ఉంటూ సామాజిక కార్యక్రమంలో తమ వంతు పాలు పంచుకుంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్టణంలో సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మనూర్ మండలంలోని రాయిపల్లి గ్రామం లో ఎస్‌బీఐ ఫౌండషన్ మరియు భవిష్య భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్మీ ట్రైనింగ్ సెంటర్ లో జరిగిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మె ల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ఇలాంటి శిబిరం నడవడం గర్వాంగా ఉందని, ఎస్‌బీఐ ఫౌండేషన్ మరి యు భవిష్య భారత్ సంస్థలకు ప్రత్యక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఆర్మీ శిబిరానికి అమ్మాయిలు రావ డం చాలా గర్వాంగా ఉందని, తాను కూడా ఎన్సీసీ క్యాడ ట్ అన్నారు. ఇలాంటి శిబిరాలకి ప్రోత్సహం అవసర మని, ప్రభుత్వంతో మాట్లాడి సహకారంగా ఉంటాన న్నారు. తన నెల జీతం నుంచి రూ.25,000 డొనేట్ చేస్తునన్నారు. ఫౌండేషన్ నుంచి సగం నిధులు సమకురిస్తే.. మిగాతాది తన స్నేహితులతో మరియు ప్రభుత్వంతో సమకూర్చే కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచందర్, ఎంపీటీసీ దొండి రావు, కో ఆప్షన్ సభ్యుడు సలీం, కరముంగి మాజీ సర్పంచ్ గుండె రావు పాటిల్, జ్ఞానేశ్వర్ పాటిల్, క్యాంప్ నిర్వాహకులు జేసీఓ జగదీశ సింగ్, క్యాంప్ మేనేజర్ జహంగీర్, అసద్, జహీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## వార్డు అభివృద్ధికి కృషి చేస్తాం : ఎజాజ్

**విశ్వంభర, పరిగి:** మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఎండి ఎజాజ్ అన్నారు. బుధవారం వార్డులో పర్యటించిన ఆయన ఎన్టీఆర్ నగర్ కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, మజిద్ రోడ్డు ప్రాంతంలో డ్రైనేజీలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించారు. వెంటనే ఈ విషయాన్నిఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కి దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపాదికన జేసీబీ సహాయంతో మరమ్మతు పనులు చేయించారు. మూడు రోజులుగా పడుతున్న సమస్యను ఎజాజ్ మూడు గంటల్లో పరిష్కరించాడని ఆయా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎజాజ్ మాట్లాడుతూ 3వ వార్డు కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## గుట్కా ప్యాకెట్లు పట్టివేత



**విశ్వంభర, కుల్కచర్ల :** అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. బుధవారంమండల కేంద్రంలోని పలు షాపుల్లో సోదాలు నిర్వహించగా మహమ్మద్ ఫయాజ్ పాన్ షాపులో ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయని తెలిపారు. వాటి విలువ సుమారు 1500 రూపాయలు ఉంటుందని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాశి ఫలాలు



– మాధవశేషు స్వామి, వాస్తు, జ్యోతిష్యం పురోహిత్, సెల్: 9059308808

**26-05-2024 నుండి 01-06-2024 వరకు**



**మేష రాశి :** సామాన్యంగా ఉన్నది. ఆలోచనలు లేక కొంత అనిశ్చితిని కలిగి ఉంటారు. నిలకడలేని తనము ఎక్కువగా ఉండును. కుటుంబ ఆర్థిక విషయాలు చికాకు కల్గించును. నిదానంగా శుభంగా పూర్తి అగును. నిద్రలేమి అధికమగును.



**వృషభ రాశి :** వ్యాపారాభివృద్ధి కల్గును. శరీరం అలసటగా ఉండును. కుటుంబ విషయాలలో ఆర్థికంగా ఆలోచించి ముందుకు సాగుతారు. పుత్రా సంతానం అభివృద్ధి ఎక్కువగా ఉండును. ఈ వారం ఇతరులకు డబ్బు ఇవ్వరాదు. ఇచ్చినచో తిరిగిరావు.



**మిథున :** సానుకూలంగా ఉన్నది. కొత్త వ్యాపారం ప్రారంభానికి ఆలోచిస్తారు. భార్య ఆరోగ్యం మెరుగుపడును. ఆకస్మిక ప్రయాణం చేయుదురు. దాచిన విలువైన కాగితాలు, డబ్బులు మరచిపోగలరు. బంధు వర్గం వారితో జాగ్రత్త అవసరం. విరోధాలు ఉండును.



**కర్కాటక :** విశేష యోగవంతంగా ఉంది. తలచిన వెంటనే పనులు పూర్తగును. విదేశీ ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి యోగవంతంగా ఉండును. స్వంత ఆలోచనతో వ్యాపారం చేయుట మంచిది. శుభ వార్తలు వింటారు.



**సింహరాశి :** సామాన్యంగా ఉన్నదని చెప్పొచు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. భార్య వలన మాట పట్టింపులు ఏర్పడును. అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడిననూ వారం చివరిలో శుభం కల్గును.




**కన్యారాశి :** అనుకూలంగా ఉన్నది. నూతన ప్రయత్నాలు ఫలించును. నిరుద్యోగులకు ఉద్యోగం ప్రాప్తించును. పుత్ర సంతానంతో ఆనందంగా కాలక్షేపం చేస్తారు. డబ్బు ఖర్చు అధికంగా ఉండును.




**తులరాశి :** ఏ విషయం ఎలా ఉన్ననూ ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరం. శారీరకంగా ఎక్కువ కష్టాన్ని కలిగి ఉందురు. సంతానం ద్వారా ధన నష్టం కల్గును. ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉండును.



**వృశ్చికరాశి :** సామాన్యంగా ఉన్ననూ, అనుకున్న కోర్కెలు నెరవేరును. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సంతోషంగా ఉంటారు. కీర్తి ప్రతిష్ఠలు మేరుగుపడును. శారీరక శ్రమ అధికం కావటం వల్ల శిరో బాధలు ఏర్పడును.




**ధనుస్సురాశి :** గడ్డుకాలంగా ఉన్నది. కోరుకున్న పనులు అవ్వక తీవ్ర నిరాశతో ఉంటారు. ఏ పని చేసిననూ ఒకటికి మూడు సార్లు తిరగవలసి వస్తుంది. వాహనం నడపడంలో జాగ్రత్త అవసరం.



**మకరరాశి :** శ్రమకు తగిన ఫలితాన్ని సాధిస్తారు. స్నేహితులతో విరోధాలు, అకాల భోజనం, సోదర విరోధం, మాట విలువ తగ్గును. ఆర్థిక విషయాలు చికాకు కలిగిస్తాయి. కోర్టు వివాదం ఒక కొలిక్కి వస్తుంది.



**కుంభరాశి :** రాజయోగంగా ఉన్నది. వ్యాపారాభివృద్ధి చెందుతారు. చేసే కృషి ఫలిస్తుంది. ఆర్థిక విషయల్లో జాగ్రత్త అవసరం. కొంత చికాకుగా ఉన్ననూ వారం చివరి వరకు అన్ని పనులు పూర్తి అగును. సోదర, బంధు వర్గం వారికి విశేష సహకారం అందించగలరు.



**మీనరాశి :** విశేషంగా ఉన్నదని చెప్పొచ్చు. కార్య దీక్షతో అన్ని పనులు పూర్తి చేస్తారు. ద్రవ్యం నిల్వ చేస్తారు. స్నేహితులతో విహారయాత్రలు చేయుదురు. ఆర్థిక విషయాలలో సంతోషంగా ఉంటారు.



## మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, షాద్‌నగర్ మే 29 :** షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో షాద్‌నగర్ 11క్రికెట్ క్లబ్ అధ్యక్షులు రవి తేజ్, మతిన్, మున్నా, శికుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ 2024ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు యువకులకు ఉపయోగపడే క్రీడలను ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీలను సమర్పించిన గోపాల్ రెడ్డి, మహమ్మద్ ఎజాజ్, మహ్మద్ రవూఫ్, డేవిడ్ రాజ్, లక్ష్మణ్ యాదవ్, కేశవ్ యాదవ్, షరీఫ్ ఖాన్, శివాజీ, మధుసూదన్ గౌడ్, ఎండీ మహమ్మద్ సహకరిస్తున్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చెంది తిరుపతిరెడ్డి, యువ నాయకుడు, క్రీడాకారుడు గౌటిక గోపాల్ రెడ్డి, యువనాయకులు ముబారక్‌ఖాన్, శ్రీను నాయక్, మురళీమోహన్ అప్పి, దిలీప్, రాజు నాయక్, లింగారెడ్డి గూడా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ అందజేసి ఎమ్మెల్యే గాంధీ



**విశ్వంభర, కూకట్ పల్లి మే 29 :** శేర్లింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కాజాగుడా హరిజన బస్తీకి చెందిన దినకర్ అత్యవసర వైద్య చికిత్స కొరకు ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన 2,30,000/- రెండు లక్షల ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివేకానంద నగర్ లోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్ నిరంతరం సేవలను అందిస్తూ అనారోగ్యంతో ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, బీఆర్ఎస్ నాయకులు, పెద్దభాస్కర్, హరినాథ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాలూర చెక్‌పోస్ట్ పై ఏసీబీ దాడులు

**అప్రమత్తమైన రవాణాశాఖ అధికారులు**




**విశ్వంభర, బోధన్ :** ఆర్టీఏ అధికారులు బలవంతపు వసూళ్లలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల పై ఏసీబీఅధికారులు నిర్వహించిన దాడులలో భాగంగా సాలూర అంతర రాష్ట్ర చెక్ పోస్ట్ పై నిజామాబాద్ జిల్లా ఏసీబీ డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏసీపీ ఇన్స్పెక్టర్లు నగేష్, శ్రీనివాస్, వేణు ఇతం అధికారులు రైడ్ చేయగా అక్రమ వసూళ్లకు సంబంధించిన 13500 రూపాయలను సీజ్ చేసినట్లు డిఎస్పీ తెలిపారు. వాహనాదారుల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తనిఖీలలో తేలిందని, అక్రమ వసూళ్లకు పాల్పడిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాలూర అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌లో ఏసీబీ అధికారులు రైడ్ రవాణాశాఖ అధికారులలో కలకలం రేపింది. జిల్లాలోని అన్ని రవాణాశాఖ కార్యాలయలలో అధికారులు అప్రమత్తమయ్యారు. బయటి వ్యక్తులను, ప్రైవేట్ ఏజెంట్లను లోపలకి అనుమతించలేదు.

## వృద్ధుడిపై కుక్కల దాడి

**పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్, గ్రామ సెక్రెటరీ**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)మే 29 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో బుధవారం వృద్ధుడు తాడూరి హంసపాదం తన ఇంటి వద్ద ఆరుబయట పడుకున్న సమయంలో ముకుమ్మడిగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా అతనిపై దాడి చేశాయి. ఈ దాడిలో అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పల్లెర్ల గ్రామంలో కుక్కలు ఎక్కువయ్యాయని, రోజురోజుకు కుక్కల దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదివరకు కుక్కల దాడుల్లో చిన్న పిల్లలు,పెద్దలు గాయపడ్డారని చెప్పారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన చెందారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే సంబంధం లేదన్నట్టు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. ఇకనైనా గ్రామంలో ఉన్న స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ, అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని పేర్కొన్నారు. నిరుపేద వృద్ధుడు హంసపాదంను ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు.



# జడ్జి రాత పరీక్షలో బీసీలకు అన్యాయం

**• బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అర్.కృష్ణయ్య**



**విశ్వంభర, ముషీరాబాద్ :** జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు సంబంధించి బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అర్.కృష్ణయ్య ఆరోపించారు. రాత పరీక్ష, వైవా-వాయిస్‌లో వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు కనీస కటాఫ్ మార్కుల సడలింపు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యానగర్ లోని బీసీ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ప్రస్తుత నోటిఫికేషన్ లో బీసీ అభ్యర్థులకు మార్కులలో సడలింపు లేకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వ నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సాధారణంగా మార్కుల సడలింపు ఉంటుందని, ఆంధ్రప్రదేశ్, కర్నాటక వంటి రాష్ట్రాలు సైతం సివిల్ జడ్జి నియామకాల్లో మార్కుల సడలింపు ఇచ్చారని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాత పరీక్షలో బీసీలకు వెంటనే 5 శాతం మార్కుల సడలింపు ఇచ్చి సామాజిక న్యాయం చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జక్కుల వంశీకృష్ణ, గుజ్జ కృష్ణ, అఖిల్ రాజ్, సూర్య జెట్టి, శివ, నీల వెంకటేశ్, అనంతయ్య, రాజ్ కుమార్, నంద గోపాల్, దీపికా బిళ్ళ, కోటేశ్వరీ లతో పాటు పలువురు పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

**విశ్వంభర, హనుమకొండ టౌన్ :** గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో గంజాయి, ఇతర మత్తుమందు పదార్థాల నియంత్రణ పై పోలీస్, నార్కోటిక్స్, విద్య, తదితర శాఖల అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తుమందు పదార్థాల నియంత్రణకు తీసుకున్న చర్యలు, రానున్న రోజుల్లో ఎలాంటి కార్యాచరణ చేపట్టనున్నారనే వివరాలను పోలీస్, నార్కోటిక్స్ తదితర శాఖల అధికారులు వివరించారు. ఆయా శాఖలు చేపట్టే చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్టమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని అన్నారు. మత్తు పదార్థాల బారిన ఎవరు పడద్దని సూచించారు. టొబాకో, గంజాయి, తదితర మత్తు పదార్థాలకు బానిసైన వారికి వైద్య సేవల కోసం 14416 టెలీ మానస్ నెంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో 20 బెడ్లతో రిహాబిలిటేషన్ సెంటర్ అందుబాటులో ఉందని. ఈ రిహాబిలిటేషన్ సెంటర్ ద్వారా బాధితులకు 30 రోజులపాటు ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్ శాఖకు చెందిన 7013036629 అనే నెంబర్ కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా పాఠశాలలు,కళాశాలలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. పాఠశాలలో కళాశాలలో నిర్వహించే యాంటీ డ్రగ్స్ కమిటీల సమావేశాలకు పోలీసులను ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ భారీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులను ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, కన్నాయిగూడెం :** మండ లంలో బుధవారం రోజున ఐలాపు రం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ములుగు జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ పరిశీలించారు. ఈ సం దర్భంగా కూలీల హాజరు పట్టిక, పని ప్రదేశంలో త్రాగునీరు, నీడ, తదితర మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఐలాపురం గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులకు జీవన ఆర్థిక పరిస్థితి ఏవిధంగామెరుగుపరచుకోవాలో పలు సూచనలు చేశారు. ఐలాపురం గ్రామంలోని భీమ్ చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన పాఠశాలను, ఐటీడీఏ ఆశ్రమం పాఠశాలల పరిస్థితులను పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరంలోపు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## రియల్మీ జీటీ 6టీ ఆవిష్కరణ

**విశ్వంభర, బషీర్ బాగ్ మే 29 :** బుధవారం రియల్మీ రెండు విప్లవాత్మక ఉత్పత్తులను ప్రకటించింది. దాని జీటీ సిరీస్, ఏఐఓటీ విభాగం కొత్త జోడింపు రియల్మీ జీటీ 6టీ -రియల్ మీ బడ్స్ ఎయిర్ 6. రెండు సంవత్సరాల కాల వ్యవధి తరువాత రియల్ మీ జీటీ 6టీ తన ఆగమనాన్ని ఐకానిక్ జీటీ సిరీస్ ఇప్పుడు రియల్మీ నిరంతారాయమైన టెక్నాలజికల్ మెరుగుదలకి, శ్రమకి ఒక ఉదాహరణగా నిలిచిందని రియల్మీ ప్రతినిధి తెలిపారు. రియల్మీ జీటీ 6టీ రెండు ఆకర్షణీయమైన రంగుల్లో అందుబాటులోకి వచ్చాయి. ఫ్లూయిడ్ సిల్వర్, రేజర్ గ్రీన్. ఇతర నాలుగు స్టోరేజ్ రకాలలో అనగా 24,999 రూపాయలకు 8జీబీ ప్లస్ 124జీబీ, 26,999 రూపాయలకు 84జీబీ ప్లస్ 256జీబీ, 29,999 రూపాయలకు 124జీబీ ప్లస్ 256 జీబీ, 33,9990 రూపాయలకు 2జీబీ ప్లస్ 512 జీబీ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.



## టీజేయూ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) మే 29 :** యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ మోటకొండూర్ మండలాధ్యక్షుడిగా గట్టికొప్పుల శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన టీజేయూ మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానుర్ బాబా హాజరై నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నియామకమైన మండల కమిటీకి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఉపాధ్యక్షుడిగా బోట్ల నర్సింగరావు, కార్యదర్శిగా కొల్లూరు మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా తొండల సతీష్ గౌడ్, సహాయ కార్యదర్శిగా కంది చంద్రకళ, కోశాధికారిగా సయ్యద్ అక్బర్, కార్యవర్గ సభ్యులుగా నవీన్, నాగరాజు, మొహమ్మద్ పాషా తదితరులు ఎన్నికయ్యారు.



## అమెరికా ఆటా వేడుకలకు కడ్తాల్ మాజీ సర్పంచ్

**విశ్వంభర, ఆమనగల్లు మే 29 :** అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జూన్ 7, 9 తేదీల్లో అమెరికా అట్లాంటా నగరంలో జరిగే 18వ అమెరికా తెలుగు యూత్ కన్వెన్షన్ లో పాల్గొనడానికి రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి అమెరికా బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



## సేవా రత్న అవార్డుకు అనూహ్యా రెడ్డి

**జూన్ 22న లండన్‌లో అందుకోనున్న అరుదైన పురస్కారం**

**విశ్వంభర, రవీంద్రభారతి :** యూకే పార్లమెంట్ వారు అందజేసే అరుదైన పురస్కారం 'సేవా రత్న అవార్డు-2024'కు కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కళా బంధు, ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ జి.అనూహ్యా రెడ్డి ఎంపికయ్యారు. ఫౌండేషన్ ద్వారా పేదలకు నిజాయితీగా అందించిన సేవలను గుర్తించి హైదరాబాద్ నగరానికి చెందిన కళాబంధు అనూహ్యా రెడ్డిని ఈ అరుదైన పురస్కారానికి ఎంపిక చేశారు. జూన్ 22వ తేదీన లండన్ పార్లమెంట్ వేదికగా హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో ఈ అరుదైన పురస్కారాన్ని ఆమె అందుకోనున్నారు. 2014 నుంచి కోవిద సహృదయ ఫౌండేషన్ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిస్వార్థంగా ఆమె పేదలకు అందించిన సేవలను సోషల్ మీడియా ద్వారా, వివిధ ఎన్జీవోల ద్వారా, టెలిఫోనిక్ సర్వేల ఆధారంగా గుర్తించిన లండన్ పార్లమెంట్ వారు అనూహ్యా రెడ్డిని ఈ అత్యున్నత పురస్కారంతో సత్కరించనున్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**విశ్వంభర, కొండపాక:** ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని రాజీవ్ రహదారి పై బుధవారం చోటు చేసుకుంది. కుకునూర్ పల్లి ఎస్ఐ పి. శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు కుకునూర్‌పల్లి మండలం మెదిన్ పూర్ గ్రామానికి చెందిన కిష్టపురం నర్సయ్య(65) మీ సేవలో పని నిమిత్తం కుకునూర్ పల్లికి వచ్చాడు. మీ సేవ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వస్తున్న ఆర్‌టిసి బస్సు అతివేగంగా నర్సయ్యని ఢీకొట్టింది. నర్సయ్యకి కాళ్లకు, చేతులకు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## ఇన్‌స్టాకు దూరంగా రేణూ దేశాయ్..
# పవన్ ఫ్యాన్సే కారణమా?

**విశ్వంభర, సినిమా:** పవన్ కల్యాణ్‌కు మాజీ భార్య కావడమో.. లేదంటే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటమో కారణం ఏదైనా రేణూదేశాయ్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. నటిగా తక్కువ సినిమాలు చేసినా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పవన్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇక ఆమె అంటే తెలియని వారే లేదు. విడాకుల తర్వాత సినిమాలకు దూరంగా ఉన్నా.. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కు దగ్గరగా ఉంటున్నారు. మంచి సామాజిక స్పృహ ఉన్న రేణూ దేశాయ్ ఇన్‌స్టాలో చాలా అంశాలపై స్పందిస్తూ ఉంటారు. అంతేకాదు.. తనకు, తన కుటుంబానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటోంది. అయితే.. ఇప్పుడు ఆమె ఇన్ స్టాకు దూరంగా ఉండాలని డిసైడ్ అయినట్టు తెలుస్తోంది. దానికి కారణం.. పవన్ కల్యాణ్, పవన్ ఫ్యాన్స్ అని సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. వారం రోజుల క్రితం ఆమె అనాథలకు, పెంపుడు జంతువులకు ఫుడ్ పెడుతూ ఫోటోలు పోస్ట్ చేశారు. దానిపై ఓ నెటిజన్.. మీది కూడా పవన్ లాగే జాలి హృదయం అని కామెంట్ చేశాడు. దీనికి ఆమె సీరియస్ గా రెస్పాండ్ అయ్యారు. ప్రతీ చిన్న విషయాన్ని పవన్ తో ఎందుకు పోల్చుతారని ప్రశ్నించారు. పవన్ కు పెట్స్ అంటే ప్రేమ ఉండదని ఆమె చెప్పుకొచ్చారు. అంతేకాదు.. తనకు చిన్ననాటి నుంచి పెట్స్ అంటే ఇష్టమని తెలిపారు. పవన్ తనకు మాజీ భర్త. ఇప్పుడు భర్త కాదని.. పవన్ తో తనను పోల్చొద్దని అన్నారు. దీంతో పవన్ ఫ్యాన్స్ .. రేణూ దేశాయ్ ని ట్రోల్ చేశారు. ఈ ట్రోలింగ్ కు ఇబ్బంది పడి ఆమె ఇన్‌స్టాకు దూరంగా ఉండాలని ఫిక్స్ అయినట్టు వార్తలు వస్తున్నాయి.

# నటి హేమకు మళ్లీ నోటీసులు



**విశ్వంభర, హైదరాబాద్ :** రేవ్ పార్టీ కేసులో నటి హేమకు మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు. హేమతో పాటు మరో 8 మందికి పంపినట్టు తెలుస్తోంది. జూన్ 1న విచారణకు హాజరుకావాలని బెంగళూరు సీసీబీ పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో ఇది వరకే హేమకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మే 27న హాజరుకావాలని తెలిపారు. కానీ, ఆరోగ్యం బాలేదని.. విచారణకు హాజరు కాలేనని ఆమె పోలీసులకు లేఖ రాశారు. రేవ్ పార్టీకి హేమ హాజరైనట్టు.. అక్కడ ఆమె డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఆమెతో పాటు 86 మంది రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడినట్లు ఇటీవల తేల్చారు. దీంతో ఈ కేసు విచారణలో పోలీసులు దూకుడు పెంచారు. అయితే మొదటి నుంచి హేమ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొదట ఆమె అసలు రేవ్ పార్టీకి హాజరుకాలేదని చెప్పారు. హాజరుకాలేదని.. తన పేరు ఎందుకు వస్తుందో తెలియదని ఓ వీడియో రిలీజ్ చేశారు. అయితే, ఆమె హాజరైనట్టు పోలీసులు ఫోటోను రిలీజ్ చేసి ఆధారాలు బయట పెట్టారు. ఆ తర్వాత హేమ మీడియాపై చిందులు వేశారు. ఇక.. విచారణకు రావాలని ఆమెను పోలీసులు ఆదేశిస్తూ నోటీసులు పంపారు. కానీ, ఆమె హాజరు కాలేదు. వైరల్ ఫీవర్ కారణంగా హాజరుకాలేనని చెప్పారు. ఆ తర్వాత ఆమె ఓ వీడియో రిలీజ్ చేశారు. తప్పు చేయకపోవడానికి మనం ఏమైనా దేవుళ్లమా? అని అన్నారు. చేసిన తప్పును అంగీకరించాలని ఆమె తెలిపారు. తప్పు నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తే 100 అబద్ధాలు ఆడాల్సి వస్తుందని అన్నారు. దీంతో... డ్రగ్స్ తీసుకున్నానని ఆమె ఒప్పుకున్నారని నెటిజన్లు కామెంట్ చేశారు. అయితే, మొదటిసారి విచారణకు హాజరుకాలేదు. న్యాయపోరాటం చేస్తానని కూడా చెప్పారు. మరి ఈసారి హాజరవుతారా? లేదా చూడాలి.




## టాలీవుడ్ ఫోకస్ అంతా
# ఇద్దరి హీరోయిన్ల మీదే!

**విశ్వంభర, సినిమా:** సక్సెస్ ఎవరి మీద ఉంటే అందరి దృష్టి వారిమీదే ఉంటుంది. చిత్రసీమలో మరీ ఎక్కువ. స్టార్ డమ్ రాగానే దర్శకనిర్మాతలే కాదు.. హీరోలు కూడా ఆ హీరోయినే కావాలని పట్టుబడుతుంటారు. ఇప్పుడు టాలీవుడ్ ఫోకస్ అంతా ఇద్దరి మీదే ఉంది. వారిలో ఒకరు బేబీ, ఇంకొకరు రాధిక. బేబీ సినిమాతో యూత్‌కి కనెక్ట్ అయిన వైష్ణవి చైతన్య నటించిన లేటెస్ట్ సినిమా లవ్ మీ. ఆత్మకూ, ఓ యువకుడికి మధ్య ప్రేమకథగా తెరకెక్కించారు ఈ చిత్రాన్ని. వైష్ణవికి.. బేబీని మరిపించే హిట్‌ని తెచ్చి పెడుతుందా ఈ సినిమా? అనే ఎదురుచూపులు బాగా కనిపిస్తున్నాయి జనాల్లో. సేమ్ వైబ్రేషన్ రాధిక విషయంలోనూ కనిపిస్తోంది. రీసెంట్ టైమ్స్ లో టిల్లు ఎంత సూపర్ హిట్ అయ్యారో, రాధిక అంత బంపర్ సక్సెస్ అయ్యారు. టిల్లు సక్సెస్ స్ట్రీక్‌ని గ్యాంగ్స్ ఆఫ్ గోదావరితో కంటిన్యూ చేయడానికి రెడీ అవుతున్నారు నేహా శెట్టి. ఈ నెల 31న విడుదల కానుంది గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ప్రమోషనల్ కంటెంట్‌తోనే సత్తా ఉన్న సినిమా అని ప్రూవ్ చేసుకుంటోంది గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. నేహాశెట్టి కేరక్టర్‌కి ఈ సారి జనాలు ఎలా రెస్పాండ్ అవుతారోననే క్యూరియాసిటీ బాగానే కనిపిస్తోంది. ఈ ఇద్దరి భామల సినిమాలు ఒకే రోజు రిలీజ్ అవుతుండటంతో ప్రేక్షకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# రూ.99కే మల్టీప్లెక్స్‌లో సినిమా

**విశ్వంభర, సినిమా :** మూవీ లవర్స్‌కు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుడ్ న్యూస్ చెప్పింది. 99 రూపాయలకే సినిమా చూడొచ్చని ప్రకటించింది. అయితే, సినిమా లవర్స్‌కు ఈ నెల 31న ఈ ఆఫర్ వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా ఏ భాష సినిమా అయినా, ఏ షో అయినా ఆడియన్స్ ఈ ఆఫర్ ను వినియోగించుకోవచ్చని ప్రకటించింది. పీవీఆర్, ఐనాక్స్, సినీపోలిస్ లాంటి చైన్లతోపాటు దేశంలో 4 వేలకుపైగా ఉన్న స్క్రీన్లలో ఇదే టికెట్ ధర అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఇటీవల ఎక్కువ మంది ఓటీటీలకే అలవాటు పడ్డారు. థియేటర్లకు వెళ్లకుండా ఇంట్లోనే సినిమాలు చూస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చి ప్రేక్షకులను మళ్లీ థియేటర్లకు రప్పించడానికి మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ నిర్ణయం



తీసుకుంది.ఈ ఆఫర్ ఇవ్వడానికి మరో కారణం కూడా ఉంది. ప్రస్తుతం దేశం మొత్తం ఎన్నికల హడావుడిలో ఉంది. దీనికి తోడు ఐపీఎల్ సీజన్ కూడా. దీంతో.. సినిమాలపై ఆడియన్స్ ఇంట్రస్ట్ చూపించడం లేదు. అందుకే పెద్దగా సినిమాలు కూడా రిలీజ్ కాలేదు. టాలీవుడ్, బాలీవుడ్ సహా ఎక్కడా పెద్ద హీరోల సినిమాలేవీ విడుదల కాలేదు. విడుదలైన చిన్న సినిమాలు కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. హాలీవుడ్ సినిమాలు కూడా పరిమితంగానే విడుదల కావడంతో టికెట్ సేల్స్ దారుణంగా పడిపోయాయి. దీంతో.. మల్టీప్లెక్స్ అసోసియేషన్ టికెట్లపై డిస్కౌంట్ ప్రకటించింది.గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మిస్టర్ అండ్ మిసెస్ మహి, ఛోటా భీమ్ అండ్ ద కర్స్ ఆఫ్ డమ్యాన్, హైక్యూ ద డంప్‌స్టర్ బ్యాటిల్ లాంటి సినిమాలు ఈ నెల 31న రిలీజ్ అవుతున్నాయి. మరి మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్ట్రాటజీ ఎంతవరకు వర్క్ అవుట్ అవుతుందో చూడాలి.

# 'విశ్వంభర' సెట్‌లో అజిత్ కుమార్.. చిరు స్పెషల్ పోస్ట్!



**విశ్వంభర, సినిమా:** మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' సెట్‌లో తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ సందడి చేశారు. ఈ సందర్భంగా చిరు ఇన్‌స్టా వేదికగా స్పెషల్ పోస్ట్ చేశారు. ఇక అజిత్ నటించిన మొదటి సినిమా 'ప్రేమ పుస్తకం' మ్యూజిక్ ఆల్బం చిరంజీవి చేతులు మీదుగానే లాంచ్ అయ్యింది. ఆ తరువాత చిరంజీవి, అజిత్ మళ్లీ కలుసుకోలేదు. 30 ఏళ్ల తరువాత మళ్ళీ ఇప్పుడు కలుసుకున్నారు. ప్రస్తుతం అజిత్ తెలుగు నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీ చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఇక ఈ మూవీ షూటింగ్ జరుగుతున్న పక్కనే చిరంజీవి 'విశ్వంభర' షూటింగ్ కూడా జరుగుతోంది. దీంతో అజిత్ కుమార్.. విశ్వంభర సెట్ కి వచ్చి చిరును కలిశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిరంజీవి ప్రత్యేక పోస్ట్ చేశారు.

# పొట్టికప్‌లో టాప్ స్కోరర్స్ వీళ్లే




**విశ్వంభర, స్పోర్ట్స్ :** 2024 టీ20 వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమవుతోంది. ఈ 9వ ఎడిషన్ టోర్నీకి అమెరికా, వెస్టిండీస్ దేశాలు ఆతిథ్యమివ్వనున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ టోర్నమెంట్‌కు మరో 3 రోజుల్లో తెరలేవనుంది . ఈ మేరకు టోర్నీలో పాల్గొననున్న ఆయా దేశాలు ఇప్పటికే జట్లను ప్రకటించి, అమెరికా పయనమవుతున్నాయి. తొలిసారి టోర్నీలో అత్యధికంగా 20 జట్లు పాల్గొననున్నాయి. ఈ క్రమంలో అన్ని జట్లు టైటిల్‌పై కన్నేశాయి. కానీ, టాప్ జట్లు భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ దేశాలు టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. అయితే ఇప్పటివరకు జరిగిన 8 ఎడిషన్‌లలో టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అత్యధిక పరుగులు సాధించిన జాబితాలో అందరికంటే ముందున్నాడు. మరి ఈ పొట్టికప్ టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్లపై ఓ లుక్కేద్దాం.

**విరాట్ కోహ్లీ:**
టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ ఈ లిస్ట్‌లో అందరికంటే ముందున్నాడు. విరాట్ ఇప్పటివరకు 25ఇన్నింగ్స్‌లో 1141 పరుగులు చేశాడు. ఇందులో 14 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 89*.

**మహేల జయవర్ధనే:**
శ్రీలంక లెజెండరీ మహేల జయవర్ధనే ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. 31 ఇన్నింగ్స్‌లు ఆడిన జయవర్ధనే 1016 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ సహా, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 100.

**క్రిస్ గేల్:**
యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ టీ20 వరల్డ్ కప్‌లో తనదైన మార్క్ చూపించాడు. పొట్టికప్ టోర్నీలో వెస్టిండీస్ తరఫున 31 ఇన్నింగ్స్ ఆడిన గేల్ 965 పరుగులు సాధించాడు. ఇందులో 2 శతకాలు, 7 అర్ధ శతకాలు ఉన్నాయి. కాగా, గేల్ వరల్డ్ కప్‌లో ఏకంగా 63 సిక్స్‌లు బాదడం విశేషం. అత్యధిక స్కోర్ 117.

**రోహిత్ శర్మ:**
టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఇప్పటివరకు జరిగిన అన్ని టీ20 వరల్డ్ కప్ టోర్నీల్లో ఆడాడు. 36 ఇన్నింగ్స్‌లలో రోహిత్ 963 పరుగులు చేసి ఈ జాబితాలో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత్ తరఫున విరాట్ తర్వాత అత్యధిక పరుగులు సాధించింది రోహిత్ శర్మే.

**తిలకరత్నే దిల్షాన్:**
శ్రీలంక మాజీ ప్లేయర్ తిలకరత్నే దిల్షాన్ ఈ లిస్ట్‌లో 5న ప్లేస్‌లో ఉన్నాడు. దిల్షాన్ ఇప్పటివరకు 34 ఇన్నింగ్స్‌లో 897 పరుగులు సాధించాడు. ఇందులో 6 అర్ధ శతకాలు ఉన్నాయి.

**టీ20 ప్రపంచకప్‌లో టాప్- 5 టీమిండియా బ్యాటర్లు**

| | |
|---|---|
| విరాట్ కోహ్లీ | 1141 పరుగులు |
| రోహిత్ శర్మ | 963 పరుగులు |
| యువరాజ్ సింగ్ | 593 పరుగులు |
| ఎమ్ ఎస్ ధోనీ | 529 పరుగులు |
| గౌతమ్ గంభీర్ | 524 పరుగులు |

## న్యూయార్క్ వీధుల్లో జైస్వాల్..
# సూర్య స్వీట్ వార్నింగ్!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** అమెరికా, విండీస్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓ వైపు మేనేజ్‌మెంట్ ప్రారంభ మ్యాచ్ కోసం అన్ని రెడీ చేస్తుండగా, ప్లేయర్లు కూడా వేదికకు చేరుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. అందులో భాగంగానే టీమిండియా కూడా ఇప్పటికే అమెరికా చేరింది. జూన్ 5న ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతోంది. అంతకంటే ముందు జూన్ 1వ తారీఖున రోహిత్ సేన బంగ్లాదేశ్‌తో ఒక వార్మప్ మ్యాచ్ ఆడనుంది. దీంతో మన క్రికెటర్లు ప్రస్తుతం నెట్స్‌లో తీవ్ర కసరత్తులు చేస్తున్నారు. అయితే, ప్రాక్టీస్ మధ్యలో కొంత విరామం దొరకడంతో కొందరు ఆటగాళ్లు అలా న్యూయార్క్ వీధుల్లో కాసేపు చక్కర్లు కొట్టారు. తాజాగా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ కూడా సరదగా న్యూయార్క్ వీధుల్లో చక్కర్లు కొట్టాడు. దానికి సంబంధించిన ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. దీంతో ఆ పిక్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ క్రమంలో యశస్వి పోస్టుపై టీ20 వరల్డ్ నం.01 బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఫన్నీగా స్పందించాడు. 'జాగ్రత్త. మీరు తోటల్లో తిరిగితే ఏమవుతుందో తెలుసుగా?' అంటూ కామెంట్ చేశాడు. దానికి నవ్వుతున్న ఎమోజీని జోడించాడు. ఇంగ్లాండ్, భారత్ రెండో టెస్టు సందర్భంగా కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ సూర్య అలా సరదాగా కామెంట్ చేశాడు. 'తోటల్లో తిరుగుతున్నట్లు తెలిస్తే' అంటూ అప్పట్లో రోహిత్ అన్న మాటలు నెట్టింట ఎంత వైరలయ్యాయో అందరికీ తెలిసిందే.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com